## సిఎంను కలిసిన కార్పొరేషన్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు


సిఎంకు బొకె అందజేస్తున్న శ్రీరామ్ చక్రవర్తి

**హుస్నాబాద్ రూరల్, మే 25, ప్రభాతవార్త:** సిఎం రేవంత్‌రెడ్డిని సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఇటీవల నియమితులైన వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, వైస్‌చైర్మన్లు కలిశారు. ఈ సందర్భంగా తమపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించినందుకు సిఎంకు వారు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని పేర్కొ న్నారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో రాష్ట్ర మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మెన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తితో పాటు వివిధ శాఖల చైర్మెన్‌లు, వైస్ చైర్మెలు పాల్గొని ముఖ్యమంత్రికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.



# మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట వార్త

## వరికొయ్యలను కాల్చవద్దు : ఎస్ఐ

**రాయపోల్, మే 25 (ప్రభాతవార్త):** పంట కోత అనంతరం పొలాల్లో మిగిలిపోయే పంట అవశేశాలు, చెత్త, ఎండిన గడ్డిని తగలబెట్టకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్ఐ కుంచం మానస రైతులకు విజ్ఞప్తి చేశారు. పంట అవశేషాలను కాల్చడం వల్ల భూమి సారవంతత తగ్గిపోవడంతోపాటు నేలలో ఉండే ఉపయోగకరమైన సూక్ష్మజీవులు, పురుగులు నశించే ప్రమాదం ఉందన్నారు. దీని ప్రభావంతో భవిష్యత్తులో పంట దిగుబడులు తగ్గే అవకాశం ఉంటుందని హెచ్చరించారు. అలాగే పంట అవశేషాలకు నిప్పు పెట్టడం వల్ల అగ్ని వేగంగా వ్యాపించి సమీపంలోని ఇళ్లు, గడ్డివాములు, విద్యుత్ తీగలు మరియు ఇతర ఆస్తులకు నష్టం కలిగే ప్రమాదం ఉందన్నారు. రైతులు పంట అవశేషాలను దహనం చేయకుండా వాటిని ఎరువుగా లేదా కంపోస్టుగా వినియోగించుకోవాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణతోపాటు భూమి సారాన్ని కాపాడటం ప్రతి రైతు బాధ్యత అని పేర్కొన్నారు. అందరూ సహకరించి పంట అవశేషాల దహనాన్ని నివారించాలని కోరారు. ఎక్కడైనా పంట అవశేషాల దహనం జరుగుతున్నట్లు గమనిస్తే వెంటనే పోలీసులకు లేదా సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.


రైస్‌మిల్ యజమానులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్

## రైతులకు ఇబ్బందులు కలిగించొద్దు

### మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్

**శివ్వంపేట, మే 25 (ప్రభాతవార్త) :** రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యాన్ని అన్‌లోడ్ చేయాలని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. సోమవారం మండలంలోని దొంతి కామాక్షి బాయిల్డ్ రైస్ మిల్‌ను అధికారులతో కలిసి కలెక్టర్ ప్రతిమాసింగ్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతిమాసింగ్ మాట్లాడుతూ ధాన్యాన్ని వేగంగా అన్‌లోడ్ చేయాలని, అకాల వర్షాలకు ధాన్యం తడవకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులు ధాన్యాన్ని దళారులకు ఆశ్రయించ వద్దన్నారు. రైస్‌మిల్ యాజమాన్యాలు ఎలాంటి అవకతవకలు పాల్పడ కూడదని జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు.

## బాధితులకు సత్వరమే న్యాయం చేయాలి

### సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**


ప్రజావాణిలో దరఖాస్తులను స్వీకరిస్తున్న అధికారులు

ప్రజావాణి బాధితులకు సత్వరమే న్యాయం చేయాలని సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి మాట్లాడారు. దరఖాస్తు దారులకు న్యాయం చేసి తిరిగి దరఖాస్తు పెట్టుకోకుండా చూడాలన్నారు. ప్రజావాణి పాత పోర్టల్‌లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను 2 వారాల్లోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. 86 మంది దరఖాస్తులను స్వీకరించినట్లు ఆమె వివరించారు. కార్యక్రమంలో డిఆర్వో నాగరాజమ్మ, కలెక్టరేట్ ఏవో, వివిధశాఖలకు అధికారులు పాల్గొన్నారు.

## ప్రతి గింజను కొనుగోలు చేస్తాం

### మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్

**నర్సాపూర్, మే 25 ప్రభాతవార్త:** రైతులు అధైర్య పడద్దని, ధాన్యాన్ని చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని మెదక్‌జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ తెలిపారు. సోమవారం నర్సాపూర్ మున్సిపాలిటీలోని సాయికృష్ణ రైస్ మిల్‌ను, ప్యాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డిఎంసిఎస్ జగదీష్, డిఎస్ఓ నిత్యానంద్ తహసీల్దార్ శ్రీనివాస్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ మాట్లాడుతూ, ధాన్యం కొనుగోళ్లను వచ్చే 10 రోజుల్లో పూర్తిచేయడానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించామన్నారు. కొనుగోలు ప్రక్రియ పూర్తి చేసేందుకు యుద్ధ ప్రాతిపదికన అధికారులు పనిచేస్తున్నారని తెలిపారు. ధాన్యం కొనుగోలు విషయంలో రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రానికి వచ్చిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జిల్లా యంత్రాంగం, కొనుగోలు సంస్థలు, రైస్ మిల్లర్లు, రవాణా విభాగాలు సమన్వయంతో యుద్ధ ప్రాతిపదికన పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. రైతులకు వెంట వెంటనే చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వలు పేరుకుపోకుండా వెంటనే రైస్ మిల్లులకు తరలిస్తూ, లోడింగ్, అన్ లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని మిల్లర్లకు సూచించారు. వర్షాలను దృష్టిలో ఉంచుకొని ధాన్యం తడవకుండా కొనుగోలు కేంద్రాల్లో ప్రత్యేక చర్యలు తీసుకుంటు న్నామని తెలిపారు. అవసరమైన టార్పాలిన్లు, గన్నీ బ్యాగులు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంచడంతో పాటు అవసరమైతే అదనపు కేటాయింపులు చేపడుతున్నామని తెలిపారు. ధాన్యాన్ని వేగంగా మిల్లులకు తరలించడం, లారీలు, ఇతర రవాణా వాహనాలను సమృద్ధిగా అందుబాటులో ఉంచడం, రైతులకు తాగునీరు, నీడ తదితర మౌలిక సదుపాయాలు కల్పించడం వంటి చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ వివరించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు సిబ్బంది రైస్ మిల్ యజమాని సురేష్ యాదవ్ పాల్గొన్నారు.

## టిపిసిసి డాక్టర్స్ సెల్ సలహాదారుడిగా ఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి నియామకం

**నారాయణఖేడ్, మే 25 ప్రభాతవార్త :**

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ(టీపీసీసీ) డాక్టర్స్ సెల్, మెడికల్ హెల్త్‌వింగ్ రాష్ట్ర సలహాదారుడిగా నారాయణఖేడ్ నియోజకవర్గ శాసన సభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి నియమితులయ్యారు. అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి. మహేష్ కుమార్‌గౌడ్, డాక్టర్స్ సెల్ మెడికల్ !! హెల్త్ వింగ్ చైర్మన్ డా. ఎం.రాజీవ్‌తో సంప్రదించి ఈ మేరకు నియామక ఉత్తర్వులను జారీ చేశారు. వైద్యరంగంలో, ప్రజా సేవలో డాక్టర్ సంజీవరెడ్డికి ఉన్న సుదీర్ఘ అనుభవాన్ని, నిబద్ధతను గుర్తించి పార్టీ అధిష్ఠానం వారికి ఈ కీలక బాధ్యతలను అప్పగించింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ప్రజారోగ్య పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలోనూ, వైద్య విభాగ బలోపేతానికి సలహాలు, సూచనలు అందించడంలోనూ ఆయన కీలకపాత్ర పోషించనున్నారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించినందుకు టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేష్‌కుమార్‌గౌడ్‌కి, చైర్మన్ డా. ఎం.రాజీవ్‌కి, కాంగ్రెస్ పార్టీ పెద్దలకు ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. వైద్య సేవలను మరింత మందికి చేరువ చేస్తూ, పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఎమ్మెల్యే నియామకంపట్ల నారాయణ ఖేడ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వైద్య ప్రముఖులు మరియు అభిమానులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు పెద్ద ఎత్తున అభినందనలు తెలుపుతున్నారు.

# పర్యావరణ పరిరక్షణకు అధిక ప్రాధాన్యం

### అటవీ శాఖ మంత్రి కొండ సురేఖ

**గుమ్మడిదల, మే 25 ప్రభాతవార్త :**

పర్యావరణ పరిరక్షణ, జీవ వైవిధ్య సంరక్షణతో పాటు ప్రజలకు ఆహ్లాదకరమైన ప్రకృతి వాతావరణాన్ని అందించాలనే లక్ష్యంతో పటాన్‌చెరు నియోజకవర్గంలోని బొంతపల్లి గ్రామంలో అభివృద్ధి చేసిన అమృతవనం 'ఎకో ఫారెస్ట్ పార్క్', మంబాపూర్ గ్రామంలోని హరిత ద్వారం 'ఫారెస్ట్ పార్క్'లను దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండ సురేఖ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించి పార్కులలో మొక్కలు నాటి ప్రారంభోత్సవాన్ని చేపట్టారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. హరిత హారం కార్యక్రమం ద్వారా కోట్లాది మొక్కలను నాటి తెలంగాణను హరిత రాష్ట్రంగా తీర్చిదిద్దే దిశగా ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యం, భవిష్యత్ తరాల సంక్షేమం కోసం పచ్చదనాన్ని పెంపొందించడం అత్యవసరమని ఆమె అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రకృతి ఒడిలో విశ్రాంతి తీసుకునేలా, కుటుంబ సభ్యులతో కలిసి సమయం గడిపేలా ఇలాంటి ఎకో ఫారెస్ట్ పార్కులు ఉపయోగపడతాయని వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పటాన్‌చెరు నియోజకవర్గ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్‌గౌడ్ పాల్గొని మాట్లాడుతూ ముఖ్యమంత్రి నాయకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని


ఫారెస్ట్ పార్కులను ప్రారంభిస్తున్న మంత్రి కొండా సురేఖ తదితరులు

చెప్పారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, పర్యావరణహిత ప్రాజెక్టులు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. అమృతవనం, హరిత ద్వారం పార్కులు స్థానిక ప్రజలకు మాత్రమే కాకుండా పరిసర ప్రాంతాల వారికి ఆకర్షణీయ కేంద్రాలుగా మారనున్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు. పార్కులలో నడక మార్గాలు, విశ్రాంతి వేదికలు, సుందరమైన పచ్చదనం, వివిధ రకాల మొక్కలు, పక్షులకు అనుకూలమైన వాతావరణం వంటి సౌకర్యాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. పర్యావరణ అవగాహన పెంపొందించేందుకు విద్యార్థులకు ప్రకృతి విద్యా కేంద్రాలుగా ఈ పార్కులు ఉపయోగపడనున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అటవీ శాఖ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువకులు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పార్కుల ప్రారంభంతో తమ ప్రాంతానికి మరింత గుర్తింపు లభిస్తుందని, పర్యాటకంగా కూడా అభివృద్ధి చెందుతుందని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

# మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యం

### మహిళా గ్రామ సంఘ భవనాలకు వర్చువల్‌గా భూమి పూజ చేసిన ముఖ్యమంత్రి
### వీడియో కాన్ఫరెన్స్‌లో వీక్షించిన కలెక్టర్, ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు

**సంగారెడ్డి మున్సిపాలిటీ, మే 25, ప్రభాతవార్త:** ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వ హిస్తున్న మహిళా వారోత్స వాల సందర్భంగా సోమ వారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పలువురు మంత్రులు, ఉన్నతాధికారులతోకలిసి రాష్ట్రవ్యాప్తంగా నిర్మించనున్న 8 వేల మహిళా గ్రామ సంఘ భవనాలకు వర్చువల్ విధానంలో భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ మహిళా సంఘాల ఆర్థిక సాధికారతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ సంకల్పమన్నారు. గ్రామీణ మహిళలు సమావేశాలు నిర్వహించుకోవడానికి, ఉపాధి నైపుణ్య శిక్షణ పొందడానికి, వారు తయారుచేసిన ఉత్పత్తులను విక్రయించడానికి మహిళా గ్రామ సంఘ భవనాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా మహిళా సంఘాలకు ఇప్పటికే రూ. 60,472 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు అందించామని, వచ్చే ఐదేళ్లలో రూ.లక్షకోట్ల రుణాలను అందించి మహిళలు స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా మరింత అభివృద్ధి చెందేలా ప్రభుత్వం తోడ్పడుతుందని పేర్కొన్నారు. పెట్రోల్ బంకులు, ఆర్టీసీకి అద్దెకు ఇచ్చే బస్సుల కొనుగోలు, సోలార్ ప్లాంట్ల ఏర్పాటులోనూ మహిళా సంఘాలకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. మహిళల సంక్షేమం, సాధికారత కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు


వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్, ప్రజాప్రతినిధులు, అధికారులు

చేస్తోందని, అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించామని గుర్తు చేశారు. ఇందిర మహిళా శక్తి చీరల పంపిణీ ద్వారా మహిళా సంఘ సభ్యులకు ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చామని తెలిపారు. అనంతరం పలు జిల్లాలకు చెందిన మహిళా సంఘాల సభ్యులు తమ విజయ గాధలను, అనుభవాలను పంచుకున్నారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్, టిజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జయప్రకాశ్‌రెడ్డి, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ వనిత, డీఆర్‌డీఓ జ్యోతి, బీడబ్ల్యూఓ, ఇంజనీరింగ్ అధికారులు, ఇతర జిల్లా అధికారులు, మహిళా సమాఖ్య సభ్యులు వీక్షించారు.


పనులు నిలిపి వేయాలని సూచిస్తున్నా మున్సిపల్ సిబ్బంది

'వార్త' ప్రభావం

## పనులను నిలిపివేసిన మున్సిపల్ అధికారులు

**సంగారెడ్డి మున్సిపాలిటీ మే 25, ప్రభాతవార్త :**

'వార్త'దినపత్రిక కథనానికి సంగారెడ్డి మున్సిపల్ అధికారులు స్పందించారు. సోమవారం 'వార్త'దినపత్రికలో "యథేచ్ఛగా నిబంధనల ఉల్లంఘన చోద్యం చూస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు" శీర్షికతో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. సోమవారం సంగారెడ్డి మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్సీస్ (టిపిబిఓ) అధికారి నజీమ్ రాజా 36వ వార్డులో జరుగుతున్న నిర్మాణాల చోటుకు వెళ్లి నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న పనులు నిలిపివేయాలని ఆదేశించామని అన్నారు. తదుపరి చర్యలు, పై అధికారుల ఆదేశం మేరకు చేపడుతామని తెలిపారు. ప్రస్తుతం పనులు మాత్రం నిలిపివేశామని ఆయన వివరించారు.

# రైతుల బాధలు రేవంత్‌రెడ్డికి కనబడడం లేదా?

### రెండు రోజుల్లో వడ్ల కొనుగోళ్లు వేగవంతం చేయకపోతే కలెక్టరేట్‌ను ముట్టడిస్తాం.. మాజీ మంత్రి, బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్‌రావు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

రైతులు గుండెలు బాదుకుంటూ...రోడ్లెక్కి చెబుతున్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి కళ్లు కనబడడం లేదు చెవులకు వినబడడం లేదని మాజీ మంత్రి, బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీష్ రావు మండిపడ్డారు. సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లిలో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి కొనుగోలు తీరు, రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. రైతుల బాధలు, కన్నీళ్లు, రేవంత్‌రెడ్డికి కనబడం లేదని, ఆర్తనాదాలు చెవులకు వినబడడం లేదన్నారు. రేవంత్‌రెడ్డి సర్కార్ మొద్దు ప్రభుత్వంగా మారిపోయిందన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే పలువురు రైతులు వడ్ల కుప్పల వద్దనే గుండెలాగి చనిపోయిన రేవంత్‌రెడ్డికి చలనం రావడం లేదన్నారు. ధాన్యం కొనుగోలు చేయడంలేదని రైతులు బాధపడుతున్నారని, కొనుగోలు కేంద్రాలలో వడ్లుపోసి నెలరోజులైనా ఇంతవరకు గన్నీ బ్యాగులు ఇవ్వలేదన్నారు. రేవంత్‌రెడ్డి మీ వడ్లు కొనే పద్ధతి చూస్తే నత్తలు కూడా సిగ్గుపడుతున్నాయన్నారు. రెండు రోజుల్లో వడ్ల కొనుగోళ్లు వేగవంతం చేయకపోతే నేనే స్వయంగా వేలాదిమంది రైతులతో కలెక్టరేట్‌ను ముట్టడిస్తానని ప్రభుత్వానికి ఆయన డెడ్‌లైన్ విధించారు. వడ్ల కొనుగోలు ప్రభుత్వానిది మిషన్ మోడ్ కాదు కమిషన్ మోడ్ అన్నారు. క్వింటాల్‌కు 5 కిలలో తరుగుతో రైతులు నిలువునా మోసపోతున్నా మంత్రులు, అధికారులు


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న హరీష్‌రావు

పట్టించుకోవడం లేదన్నారు. సిద్దిపేట గడ్డపై 45 రోజుల్లో పూర్తి రైతు బంధు ఇస్తానని ప్రగల్భాలు పలికిన సిఎం 63 రోజులైనా మాట నిలబెట్టుకోలేదన్నారు. రేవంత్‌రెడ్డి సర్కార్‌కు రైతులంటే పట్టింపు లేదన్నారు. గతంలో కెసిఆర్ సిఎంగా ఉన్నప్పుడే కాదు ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ఆర్, రోశయ్య, కిరణ్ కుమార్‌రెడ్డి ఇలా ఏ ముఖ్యమంత్రి ఉన్నా రైతులకు ఇంత బాధ, కష్టం రాలేదన్నారు. మిల్లుల్లో బస్తాకు 43 కిలోలు పెడితేనే దించుకుంటామని మిల్లర్లు రైతులను బ్లాక్ మెయిల్ చేస్తున్నారని తెలిపారు. దీంతో ఎకరాకు 150 కిలోల చొప్పున రైతులు నష్టపోతారని వివరించారు. రోహిణీ కార్తె వచ్చినా కొనుగోలు కాక వడ్లు కల్లాల్లోనే మగ్గుతున్నాయన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ ట్రిప్పులు బంద్ చేసి కొనుగోలు కేంద్రాలకు లారీల ట్రిప్పులు పెంచాలన్నారు. మక్కలు, సన్‌ఫ్లవర్, జొన్నలు అమ్మిన రైతులకు ఆ డబ్బులు ఖాతాల్లో జమ చేయాలన్నారు. ఆయన వెంట బిఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు తదితరులు ఉన్నారు. అనంతరం సిద్దిపేట ఆర్డీఓ సదానందంకు హరీష్ రావు ఫోన్‌చేసి రైతుల సమస్యలను విన్నవించారు. ఉన్నతాధికారులకు, జిల్లా కలెక్టర్‌కు ఫోన్ చేసినప్పటికీ స్పందించడం లేదని రైతుల ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలన్నారు.


కారుపై విరిగి పడిన చెట్టు, పక్కన ఎండివో కారాలయంలో విరిగిపడిన చెట్టు

## ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం

### -కూలిన చెట్లు.. తెగిపడిన విద్యుత్ వైర్లు

**ఝరాసంగం, మే 25, ప్రభాతవార్త:** ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురవడంతో మండలంలోని ఆయాగ్రామాలు అతలాకుతలమయ్యాయి. ఈదురు గాలులకు చెట్లు, విద్యుత్ స్థంభాలు విరిగిపోవడం, వైర్లు తెగిపోవడంతో ప్రజలు ఇబ్బందులకు పడాల్సి వచ్చింది. ఇతర ప్రాంతాలకు వెళ్లిన ప్రజలు గ్రామాలకు చేరుకునేందుకు పడిన పాట్లు చెప్పనలవిగా ఉన్నాయి.

### కళ్లేపల్లిలో...


వర్షంతో ఎగిరి పడిపోయిన రేకులు

**బెజ్జంకి, మే 25, ప్రభాతవార్త :** మండల పరిధిలోని కళ్లేపల్లిలో సోమవారం ఈదురు గాలులతో కూడిన అకాల వర్షానికి చింతకింది ఎల్లయ్య, చేలుకల రజిత, బొల్లుమల్ల రాజు దొంతి వీరయ్య, బుర్ర స్వాతి ఇంటి రేకులు గాలికి ఎగిరిపోయాయి. జిల్లా పరిషత్ స్కూల్ ఆవరణలో రేకులు కొట్టుకుపోయాయి. గ్రామంలో చెట్లు విరిగి విద్యుత్ తీగలపై పడగా తీగలు తెగి గ్రామ ప్రజల ఇండ్లపై పడ్డాయి. అధికారులు గ్రామాన్ని సందర్శించి సహాయక చర్యలు చేపట్టారు. అలాగే మండల పరిధిలోని గూడెం మదిర గుంటూరుపల్లెలో సైతం వర్షం బీభత్సం సృష్టించింది.

### బెజ్జంకిలో...

**బెజ్జంకి, మే 25, ప్రభాతవార్త :** మండల కేంద్రంలో సోమవారం సాయంత్రం ఈదురుగాలులతో కురిసిన వర్షానికి నష్టం వాటిల్లింది. ఈదురు గాలులు, గాలి దూమరంతో కొన్ని ఇళ్లు పాక్షికంగా ధ్వంసం అయ్యాయి. ఇళ్లపై ఉన్న రేకుల పైకప్పులు ఎగిరి పక్కనే ఉన్న ఇళ్లపై పడడంతో భయాందోళనలకు గురయ్యారు. వర్షానికి దెబ్బతిన్న ఇళ్లను సర్పంచ్ బొల్లం శ్రీధర్ పెద్దన్న పరిశీలించారు. ప్రాణ నష్టం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

### గుడుపల్లిలో...

**మొగుడంపల్లి, మే 25, ప్రభాతవార్త:** సోమవారం సాయంత్రం మండల పరిధిలోని గుడుపల్లి గ్రామంలో కురిసన అకాల వర్షానికి ప్రజలు తల్లడిల్లిపోయారు. ఈదురుకాగులలో కురిసిన భారీ వర్షానికి ఇంటిపై కప్పుకున్న రేకులు పతంగుల్లా ఎగిరిపోగా పెద్ద పెద్ద చెట్లు నేలకూలాయి. మండలంలోని గుడుపల్లి గ్రామానికి చెందిన నిరుపేద మహిళ పరిగి స్వరూప ఇంటిపై కప్పుకున్న రేకులు ఎగిరిపోవడంతో ఇంట్లోని నిత్యావసర సరుకులు నాటిపాలయి పనికిరాకుండా పోయాయి. నిరుపేద పరిగి స్వరూపను ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని గ్రామస్థులు వినతి చేస్తున్నారు.

## దాన్యం కొనుగోలు కేంద్రం నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి


ధాన్యం ట్రాక్టర్‌లను అడ్డుకొని రైతులతో మాట్లాడుతున్న జిపిఒ బాలయ్య

**కొండపాక, మే 25, ప్రభాతవార్త :** ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో కలెక్టర్ కార్యాలయం ఎదుట ధాన్యం పోసేందుకు రైతులు తీసుకెళ్తున్న ట్రాక్టర్‌లను రెవెన్యూ అధికారులు సోమవారం అడ్డుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. తొగుట మండల పరిధిలోని పెద్ద మాసాన్‌పల్లి గ్రామానికి చెందిన రైతులు అల్యాల రాజిరెడ్డి, కంది ముత్యంరెడ్డి మాట్లాడుతూ నెల రోజుల క్రితం కొనుగోలు కేంద్రానికి ధాన్యాన్ని తీసుకొచ్చి ఆరబెట్టి, మ్యాచర్ వచ్చేల ధాన్యాన్ని సిద్ధంచేసినట్లు వారు తెలిపారు. ధాన్యం కొనుగోలు విషయంలో కేంద్రం నిర్వాహకులకు చెప్పి చెప్పి విసుగుచెందమన్నారు. ధాన్యాన్ని కొనుగోలు చేయడంలేదంటూ తహసీల్దార్‌తో పాటు పలువురు అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోకపోవడంతో ధాన్యాన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట పోయడానికి తీసుకెళ్తున్నట్లు రైతులు తెలిపారు. విషయం తెలుసుకున్న తొగుట రెవెన్యూ అధికారులు అప్రమత్తమై కొండపాక మండల పరిధిలోని మర్పడ్గ శివారులోని రైస్‌మిల్లు సమీపంలో కలెక్టర్ కార్యాలయనికి తీసుకెళ్తున్న ట్రాక్టర్‌లను అధికారులు అడ్డుకొని రైతులను సముదాయించారు. ఈ సందర్భంగా అధికారులు దగ్గరుండి మీ ధాన్యాన్ని కొనుగోలు చేయిస్తామని రైతులకు హామీ ఇచ్చారు. అనంతరం రెవెన్యూ అధికారులు ఇచ్చిన హామీ మేరకు తిరిగి రైతులు పెద్దమాసాన్‌పల్లి ధాన్యం కొనుగోలు కేంద్రానికి ట్రాక్టర్‌లను తరలించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వాహకులు గత కొన్ని రోజుల నుండి మా దాన్యం కొనుగోలు చేయకుండా ఇష్టరీతిన వ్యవహరిస్తున్నారని అవేదన వ్యక్తం చేశారు. వారికి నచ్చిన వారి ధాన్యాన్ని కొనుగోలు చేస్తు అనేక ప్రలోభాలకు లోనవుతున్నారని మండి పడ్డారు. అరుగాలం కష్టపడి పండించిన మా ధాన్యాన్ని కొనుగోలు చేయకుండా నిర్లక్ష్యంగా, ఇష్టరీతిగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వహకులపై జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకొని ప్రతి రైతుకు న్యాయం జరిగేలా చూడాలని వారు కోరారు.

## టిప్పర్ కిందపడి కూలీ మృతి

**చిన్నశంకరంపేట, మే 25,ప్రభాతవార్త:**

టిప్పర్ లారీ కింద పడి రోజూ కూలీ మృతి చెందిన సంఘటన చిన్నశంకరంపేటలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్ఐ శివానందం కథనం ప్రకారం... మహరాష్ట్ర, నాందేడ్ జిల్లా, మదుగని గ్రామానికి చెందిన సునిల్(21) కొన్ని రోజులుగా చిన్న శంకరంపేటలోని దుర్గపతి ఇటుక బట్టీలలో రోజూ కూలీగా పనిచేస్తున్నాడు. ఉదయం నాలుగు గంటల సమయంలో ఇటుక బట్టీల వద్దకు టిప్పర్ లారీని తీసుకొచ్చిన ధరావత్ సురేష్ నిర్లక్ష్యంగా నడపడంతో సునిల్ పైకి టిప్పర్ లారీ వెళ్లగా అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ఇటుకబట్టీ యజమాని దుర్గపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## ఉమ్మడి దేవాలయాల వృత్తిదారుల సంఘం నూతన అధ్యక్షులుగా సుదర్శన్



ఉమ్మడి దేవాలయాల వృత్తిదారుల సంఘం నూతన అధ్యక్షులుగా ఎన్నికైన గట్టు సుదర్శన్‌ను సన్మానిస్తున్న సంఘం ప్రతినిధులు

**చాంద్రాయణగుట్ట, మే 25, ప్రభాతవార్త :** ఉమ్మడి దేవాలయాల వృత్తిదారుల సంఘం నూతన అధ్యక్షులుగా గట్టు సుదర్శన్ ఏకగ్రీవంగా ఎన్నికైయ్యారు. వచ్చే ఆషాఢ మాసంలో జరిగే బోనాల ఉత్సవాలను ఆయా అమ్మవారి ఆలయాల వద్ద వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. ఇందు కోసం నూతన కమిటీని ఎన్నుకున్నారు. లాల్‌దర్వాజా పూల్‌బాగ్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం ఆవరణలో సంఘ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గట్టు సుదర్శన్ మాట్లాడుతూ వచ్చే మహంకాళి బోనాల జాతరను ఉమ్మడి దేవాలయాల వృత్తిదారుల సంఘం నేతృత్వంలో ఘనంగా నిర్వహిస్తామన్నారు. సంఘంలో కోశాధికారిగా పనిచేసిన అనుభవం, పెద్దల సహకారంతో తన కర్తవ్యాన్ని చిత్తశుద్ధితో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పేరోజి మహేశ్వర్, సంఘం సలహాదారులు నాగిల కృష్ణ, బొమ్మరాజు దేవేందర్, పేరోజి ప్రదీప్ కుమార్, ప్రధాన కార్యదర్శి కొల్లూరు జ్ఞానేశ్వర్, కోశాధికారి బొమ్మరాజు రాజు, ఉపాధ్యక్షులు దేవులపల్లి పాండు, కొల్లూరు వెంకటేష్, బర్గెల జగదీష్, సహ ప్రధాన కార్యదర్శి సిహెచ్. మలేష్, మల్కాజిగిరి నరేష్, పేరోజి సురేందర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## గాజులరామారంలో ఆక్రమణల తొలగింపు



ఆక్రమణలను తొలగిస్తున్న దృశ్యం

**జీడిమెట్ల, మే 25, ప్రభాతవార్త**

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఆదేశాల మేరకు గాజులరామారం సర్కిల్ డిప్యూటీ కమిషనర్ యు. వెంకట్రాములు పర్యవేక్షణలో టౌన్ ప్లానింగ్ సిబ్బంది భారీ ఆక్రమణల తొలగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. రామ్‌కీ అపార్ట్‌మెంట్స్ నుంచి మహాదేవపురం వరకు రహదారికి ఇరువైపులా ఉన్న అనధికారిక షాపులు, తోపుడు బండ్లు, ఫుట్‌పాత్‌లను ఆక్రమించి ఏర్పాటు చేసిన తాత్కాలిక నిర్మాణాలను జేసీబీల సహాయంతో తొలగించారు. ఈ మార్గంలో రోజురోజుకూ ట్రాఫిక్ సమస్యలు పెరుగుతుండటంతో పాటు కాలినడకన వెళ్లే ప్రజలు ప్రమాదాలకు గురవుతున్న నేపథ్యంలో అధికారులు ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఆక్రమణల కారణంగా వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ యు. వెంకట్రాములు మాట్లాడుతూ, రోడ్లను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహించడం వల్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోందని అన్నారు. మరోసారి ఎవరైనా రహదారులపై ఆక్రమణలకు పాల్పడితే వారి సామగ్రిని స్వాధీనం చేసుకోవడంతో పాటు చట్టపరమైన చర్యలు కూడా తీసుకుంటామని హెచ్చరించారు. వ్యాపారులు మున్సిపల్ నిబంధనలు పాటిస్తూ నగర రవాణా వ్యవస్థ సజావుగా సాగేందుకు సహకరించాలని కోరారు.

## ఐఎన్‌టియూసి మేడ్చల్ జిల్లా అధ్యక్షుడిగా రవికాంత్



నియామక పత్రాన్ని అందు కుంటున్న రవికాంత్

**దుండిగల్, మే 25, ప్రభాతవార్త**

భారత జాతీయ కార్మిక కాంగ్రెస్ (ఐఎన్‌టీయూసీ) ఆధ్వర్యంలో కార్మిక ఉద్యమాన్ని మరింత బలోపేతం చేసే దిశగా అత్వెల్లి రవికాంత్‌ను మేడ్చల్ జిల్లా అధ్యక్షుడిగా నియమించారు. ఈ సందర్భంగా ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ సంజీవ రెడ్డి చేతుల మీదుగా రవికాంత్ నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ కార్యక్రమానికి ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడు, తెలంగాణ జలమండలి అధ్యక్షుడు మొగుళ్ల రాజిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై రవికాంత్‌కు శుభాకాంక్షలు తెలిపారు. కార్మికుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, ఉద్యోగ భద్రత కోసం మరింత సమర్థవంతంగా పనిచేయాలని ఆకాంక్షి ంచారు. అలాగే ఐఎన్‌టీయూసీ కార్యదర్శి చంద్రశేఖర్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారం, సంక్షేమ పథకాల అమలు, ఉద్యోగుల హక్కుల సాధనలో ఐఎన్‌టీయూసీ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. అత్వెల్లి రవికాంత్ నాయకత్వంలో మేడ్చల్ జిల్లాలో కార్మిక ఉద్యమం మరింత బలోపేతం అవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. కార్మికుల ఐక్యతే మా బలం – కార్మికుల సంక్షేమమే మా లక్ష్యం అనే నినాదంతో కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రోటోకాల్ అండ్ కోఆర్డినేషన్ వైస్ చైర్మన్ బి. కిషోర్ రెడ్డి, ఐఎన్‌టీయూసీ నాయకులు, పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం



సమావేశానికి తరలివెళ్లుతున్న కార్పోరేటర్ నాయకులు.

**బేగంపేట మే 25,ప్రభాతవార్త**

కూకట్‌పల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం సోమవారం ఎన్ కే ఎన్ ఆర్ గార్డెన్స్‌లో జరిగింది. ఈ సమావేశానికి బేగంపేట బీఆర్ఎస్ మాజీ కార్పోరేటర్ టి.మహేశ్వరి శ్రీహరి, డివిజన్ మాజీ అధ్యక్షుడు పొన్నబోయిన సురేష్ యాదవ్‌ల ఆధ్వర్యంలో బేగంపేట డివిజన్ నాయకులు కార్యకర్తలతో కల్సి వెళ్లారు. ఈ సందర్భంగా మాజీ కార్పోరేటర్ టి.మహేశ్వరి శ్రీహరి మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హాయాంలోనే కూకట్‌పల్లి నియోజకవర్గం బేగంపేట డివిజన్ లో ఎన్నో అభివృద్ధి పనులు చేయడం జరిగిందన్నారు. ఎన్నికల సమయంలో మహిళలకు తులం బంగారం ఇస్తామంటూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందన్నారు. అబద్దపు హామీలతో కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తుందని అన్నారు. పెద్ద ఎత్తున కార్యకర్తలు విస్తృత స్థాయి సమావేశానికి తరలి వెళ్లిన వారిలో టి.శ్రీహరి, పొన్నబోయిన సురేష్ యాదవ్, నరేష్, సామాల పాండు, బంగారి శ్రీను కార్యకర్తలు ఉన్నారు.

# మొహర్రం ఏర్పాట్లపై ఎమ్మెల్సీ సమావేశం



మొహర్రం అభివృద్ధి పనుల గురించి జెడ్సి సత్యనారాయణతో చర్చిస్తున్న ఎమ్మెల్సీ మిర్జా రియాజుల్ హాసన్ అఫందీ

**చాంద్రాయణగుట్ట, మే 25, ప్రభాతవార్త :** మొహర్రం సందర్భంగా దబీర్‌పురా బీబీకా అలావా నుండి ప్రధాన ఊరేగింపు మార్గంలో పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు చేపట్టాలని మజ్లిస్ పార్టీ ఎమ్మెల్సీ మిర్జా రియాజుల్ హసన్ అఫంది జీహెచ్ఎంసి చార్మినార్ జోనల్ కమిషనర్ సత్యనారాయణను కోరారు. సోమవారం నర్కిపూల్‌బాగ్‌లోని జోనల్ కార్యాలయంలో అధికారులతో సమావేశమైన ఎమ్మెల్సీ పారిశుధ్యం, తాగునీరు, వీధి దీపాలు, రోడ్ల మరమ్మతులు, డ్రైనేజీ తదితర సమస్యలపై చర్చించారు. అన్ని శాఖల అధికారులు పరస్పరం సమన్వయంతో పనిచేసి మొహర్రం సంతాప దినాలను విజయ వంతం చేయాలని సూచించారు.

**అభివృద్ధి పనులపై చర్చించిన ఎమ్మెల్యే**

యాకుత్‌పురా నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల వేగం పెంచి, వర్షాకాలానికి ముందే నాలాలలో పూడికతీత పనులను పూర్తి చేయాలని ఆ నియోజక వర్గ శాసనసభ్యులు జాఫర్ హుస్సేన్ మేరాజ్ అధికారులను ఆదేశించారు. జెడ్సి సత్యనారాయణ, ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్, శానిటేషన్, ప్రాజెక్ట్స్ అధికారులతో సమావేశమై దిశా నిర్దేశం చేశారు. ఈనెల 28న జరుపుకునే బక్రీదు పండుగకు పారిశుధ్య సమస్య లేకుండా చూడాలన్నారు. జంతు వ్యర్థాల తరలింపుకు ప్రత్యేక వాహనాలను, పర్యవేక్షకులను నియమించాలని సూచించారు. ఈ సమావేశంలో ఎస్ఇ ఇందిరాదేవి, ఈఈ యాదగిరి, డిఈ సత్యనారాయణరెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

**ప్రజావాణిలో పారిశుధ్యంపై అర్జీ**

సోమవారం జెడ్సి కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో సంతోష్‌నగర్ సర్కిల్లో పారిశుధ్య సమస్యను పేర్కొంటూ ఒక ఫిర్యాదు అందింది. ప్రజల ప్రజావాణి ద్వారా బస్తీ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని జెడ్సి సత్యనారాయణ కోరారు. ఈ కార్యక్రమంలో అధికారులు దేవజా, రాజారావు, సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జలమండలి గుర్తింపు సంఘం ఎన్నికల్లో త్రిశూలం గుర్తును గెలిపించాలి : రాజిరెడ్డి



జలమండలి గుర్తింపు సంఘం ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మొగుళ్ళ రాజిరెడ్డి, చిత్రంలో ధర్పెల్లి రాజశేఖర్ తదితరులు

**హైదరాబాద్, మే 25 ప్రభాతవార్త**

అనేక దశాబ్దాలుగా పోరాటాలు చేసి జలమండలి ఉద్యోగ, కార్మికుల అనేక సమస్యలు పరిష్కరించిన చరిత్ర ఐఎన్‌టీయూసీ అనుబంధ తెలంగాణ జలమండలి ఎంప్లాయిస్ యూనియన్‌కు ఉందని యూనియన్ అధ్యక్షుడు, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ముఖ్య ఉపాధ్యక్షుడు మొగుళ్ళ రాజిరెడ్డి అన్నారు. జలమండలి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల సందర్భంగా సోమవారం వనస్థలిపురం పరిధిలోని సాహెబ్‌నగర్, హెచ్ఎండబ్ల్యూఎస్ ఎస్‌బీ కార్యాలయంలో సోమవారం మొగుళ్ళ రాజిరెడ్డితోపాటు మాజీ కార్పొరేటర్, ఫ్లోర్ లీడర్ ధర్పెల్లి రాజశేఖర్ తదితరులు ఎన్నికల ప్రచారం నిర్వహించి, ఉద్యోగ, కార్మికులను కలసి త్రిశూలం గుర్తుకు ఓటు వేసి జలమండలి ఎంప్లాయిస్ యూనియన్‌ను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా మొగుళ్ళ రాజి రెడ్డి మాట్లాడుతూ జలమండలి కార్మికుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం మరియు భవిష్యత్తు కోసం ఐక్యంగా ముందుకు సాగాల్సిన సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు. జలమండలిలోని అన్ని విభాగాల్లో పోస్టుల అప్‌గ్రేడేషన్ చేసి ఉద్యోగులకు న్యాయమైన ప్రమోషన్లు కల్పించేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. ఉద్యోగులు, పెన్షనర్లు మరియు వారి కుటుంబాలకు తెలంగాణ ప్రభుత్వ ఈ.హెచ్.ఎస్ పథకం ద్వారా పూర్తిస్థాయి క్యాష్‌లెస్ వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. జూన్ 6న జరిగే గుర్తింపు సంఘం ఎన్నికల్లో త్రిశూలం గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కార్మికులను మొగుళ్ళ రాజిరెడ్డి కోరారు. ధర్పెల్లి రాజశేఖర్ మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు మరణించిన లేదా వికలాంగులైన ఉద్యోగులకు రూ.50 లక్షల పరిహారం, కుటుంబ సభ్యులకు తక్షణ కరుణా నియామకాలు కల్పించే దిశగా పోరాటం కొనసాగిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు కే. రాజిరెడ్డి, టి.జె.ఎం.ఈ.యు ప్రధాన కార్యదర్శి రాఘవేంద్ర రాజ్ నేతలు ఈ.చంద్రశేఖర్, సైద్ అక్తర్‌అలీ, బి.జై రాజ్, కె.ఆనంద్‌రెడ్డి, బి.శంకర్ ప్రకాష్, బి. నర్సింగ్‌రావు, సి.రాజు, ఇందూరి తిరుపతి, వినోద్‌గౌడ్, వి.కృష్ణ, రాములుముదిరాజ్, మజారుద్దీన్, సత్య బాబు, జై శంకర్, సాయిలు, విట్టల్ బాబు, నర్సింగ్ రాజు, బాలకృష్ణ, రాజేష్ నాయక్, వామన్, గణేష్ నాయక్, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

## విఖ్యాత వాగ్గేయకారుడు తాళ్లపాక అన్నమాచార్య : వివేక్



చిక్కడపల్లి త్యాగరాయగానసభలో అన్నమయ్య కీర్తనల సంగీత నృత్య ప్రదర్శన నిర్వహించిన దృశ్యం

**చిక్కడపల్లి మే 25 ప్రభాతవార్త ;**

విఖ్యాత వాగ్గేయకారుడు శ్రీ తాళ్లపాక అన్నమాచార్య 618వ జయంతిని పురస్కరించుకుని నగరంలో నిర్వహించిన అన్నమయ్య కీర్తనల సంగీత నృత్య ప్రదర్శన ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. సోమవారం చిక్కడపల్లి త్యాగరాయగానసభలో ఎస్ కె ఎన్ ఫౌండేషన్ నిర్వహణలో జరిగిన ఈ కార్యక్రమంలో కాటూరి రాజా, సాయి శివాని, కృష్ణకుమారి, మనోజ్ఞ, జ్యోతిర్మయిల శిష్య బృందం అద్భుత ప్రదర్శనలతో అలరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో పబ్లిక్ సర్వీస్ కమిషన్ పూర్వ సభ్యుడు వివేక్, సంఖ్యాశాస్త్రవేత్త దైవజ్ఞ శర్మ ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. తాత్విక, ఆధ్యాత్మిక, శృంగార, సామాజిక స్పృహ కలిగిన వేలాది కీర్తనలను అన్నమయ్య మానవాళికి అందించారని కొనియాడారు. నేడు అన్నమయ్య కీర్తనలు ప్రపంచ వ్యాప్తంగా విశేష ప్రచారంలో ఉన్నాయని వారు పేర్కొ న్నారు. సభ ప్రారంభంలో సంస్థ స్థాపకుడు డాక్టర్ వెంకట్ ఫౌండేషన్ వార్షిక నివేదికను సమర్పించారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, సంగీత, నృత్య అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## డాక్టర్ అప్పికట్ల భరత్ భూషణ్‌కు జీవిత సాఫల్య పురస్కారం



డాక్టర్ అప్పికట్ల భరత్ భూషణ్‌కు జీవిత సాఫల్య పురస్కారం ప్రధానం చేసిన దృశ్యం

**చిక్కడపల్లి, మే 25 ( ప్రభాతవార్త ):**

సామాజిక సేవా రంగంలో విశేష సేవలు అందించిన విశ్రాంత ఐఆర్‌పీఎస్ అధికారి డాక్టర్ అప్పికట్ల భరత్ భూషణ్‌ను జీవిత సాఫల్య పురస్కారం తో సోమవారం సత్కరించారు. బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బంధు సొసైటీ అధినేత పి.వీరాస్వామి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఈ పురస్కార ప్రధానోత్సవ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు, ఇతర ప్రముఖులు భరత్ భూషణ్‌కు అవార్డును అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. సభలో వక్తలు మాట్లాడుతూ ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ రాసి ఐఆర్‌పీఎస్ అధికారిగా రైల్వేలో సుదీర్ఘకాలం పాటు విశిష్ట సేవలు అందించి, ఉన్నతాధికారుల ప్రశంసలు అందుకున్నారని కొనియాడారు. బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా బంధు సొసైటీకి, సమాజానికి ఆయన అందిస్తున్న సేవలు ఎంతో ఆదర్శనీయమని వక్తలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బంధు సొసైటీ ప్రధాన కార్యదర్శి ఇ. దేవాదానం, కోశాధికారి కె. వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు అంకుశయ్య, సహాయ కార్యదర్శి హంస రాజు, కార్యవర్గ సభ్యులు దయానంద్, హరినాథ్ పాల్గొన్నారు.

## పార్టీ కార్యకర్త సురేందర్‌కు కెటిఆర్ పరామర్శ



**చిక్కడపల్లి మే 25 ( ప్రభాతవార్త ) :** ఇచ్చిన మాట మేరకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కేటీఆర్ సోమవారం ముషీరాబాద్ నియోగజకవర్గం అడిక్ మెట్ డివిజన్ పార్టీ నేత కె.సురేందర్ అనారోగ్య సమస్యలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకుని పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని, కుటుంబ క్షేమ సమాచారాలను అడిగి లుసుకున్నారు. ముషీరాబాద్‌కు చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ కార్యకర్త సురేందర్ అనారోగ్యంతో ఉన్నారని ఆయన కొడుకు ఉమాశంకర్ ఎక్స్ (ట్విట్టర్) వేదికగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దృష్టికి తీసుకువచ్చారని తెలిసిందే. దీనికి కేటీఆర్ స్పందిస్తూ సురేందర్‌ను త్వరలోనే కలుస్తాను అని మాట ఇచ్చారు. ఇచ్చిన మాట మేరకు కేటీఆర్ ఆదివారం ముషీరాబాద్ నియోగజకవర్గానికి వెళ్లి అనారోగ్య సమస్యలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సురేందర్‌ను పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని, కుటుంబ క్షేమ సమాచారాలను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యసాయం అందించాలని డాక్టర్లకు సూచించిన కేటీఆర్ సురేందర్ కుటుంబసభ్యులకు ఆర్థిక సహాయం అందించారు. కేటీఆర్ వెంట మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్‌ఉ, సురేందర్ కుటుంబసభ్యులు అనురాధ తదితరులు పాల్గొన్నారు.

## సురవరం ప్రతాపరెడ్డి తెలంగాణ అస్తిత్వ ఉద్యమ ప్రతీక : ఆచార్య కొలకలూరి ఇనాక్

**చిక్కడపల్లి మే 25 ( ప్రభాతవార్త ):**

సురవరం ప్రతాపరెడ్డి తెలంగాణ అస్తిత్వ ఉద్యమ ప్రతీక అని శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. ఎందరో మహనుభావులు మధురస్మృతులలో భాగంగా సోమవారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభ లోని కళా మారుతీ కళా వేదికలో గానసభ నిర్వహణలో అధ్యక్షుడు కళావీఎస్ జనార్దన మూర్తి అధ్యక్షతన సాహితీ వేత్త , పత్రికా రచయిత , ఉద్యమ కారులు సురవరం ప్రతాపరెడ్డి సంస్మరణ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా ఆచార్య కొలకలూరి ఇనాక్ పాల్గొని మాట్లాడుతూ సురవరం ప్రతాప రెడ్డి గోల్కొండ పత్రిక సంపాదకుడు గా తెలంగాణ సాయుధ పోరాటం లోనూ అనంతరం తొలి తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని వివరించారు. రాజకీయాలకు అతీతంగా ఆయన అందరి అభిమానం పొందిన నిస్వార్థ నాయకుడని కొనియాడారు. సభలో అభినందన సంస్థల కార్యదర్శి డాక్టర్ ఈ భవాని, సంఘ సేవకులు పిఎస్ఆర్. గాయని రాధా రాణి తదితరులు పాల్గొన్నారు.

## బక్రీద్ పండుగ సందర్భంగా బహదూర్‌పురలో అన్ని ఏర్పాట్లు : జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి



మీరాలం ఈద్గాలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్, జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి

**మైలార్‌దేవ్‌పల్లి, మే 25 ప్రభాతవార్త :** బహదూర్‌పుర నియోజకవర్గం ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్ సోమవారం రాజేంద్రనగర్ జోన్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డితో కలిసి నియోజకవర్గంలోని మీరాలం ఈద్గా, బహదూర్‌పుర నాలా, చందూలాల్ బారాదరి స్పోర్ట్స్ కాంప్లెక్స్ జహనుమా, ఫలక్‌నుమా, ఇంజన్‌బౌలి తదితర ప్రాంతాలలో పలు ప్రాంతాలలో పర్యటించారు. బక్రీద్ పండుగ సందర్భంగా పలు ప్రాంతాలలో కొనసాగుతున్న అభివృద్ధి నిర్మాణ పనులు. రహదారులు, డ్రైనేజీలు, పారిశుద్ధ్య నిర్వాహణ, వీధి దీపాలు తదితర పనులను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా రాజేంద్రనగర్ జోన్ జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ పనులలో ఎటువంటి ఆలస్యం జరగకుండ వేగంగా పూర్తి చేయాలని, బక్రీద్ పండుగ సందర్భంగా ప్రజలకు ఇబ్బందులు కలగకుండ ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టాలనిసంబంధిత అధికారులను ఆదేశించారు. బక్రీద్ పండుగ రోజున చారిత్రక మీరాలం ఈద్గాలో జరగనున్న ప్రార్ధనలకు ఎలాంటి అసౌకర్యం లేకుండ అవసరమైన ఏర్పాట్లు చేశామని ఆయన తెలిపారు. జంతు వ్యర్ధ పదార్ధాలను తరలించేందుకు అన్ని ప్రాంతాలలో ప్రత్యేక వాహనాలు, జెసిబిలను ఉంచాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, బహదూర్‌పుర ఫలక్‌నుమా డిఎంసిలు అరుణ కుమారి, సఫీ ఉల్లా, రాజేంద్రనగర్ జోన్ ఎస్ఈ నరేందర్ గౌడ్, ఈఈ శేషయ్య, డిఈలు, ఏఈఈల అధికారులు పాల్గొన్నారు.

## 1969 తెలంగాణ ఉద్యమకారులను ప్రభుత్వం గుర్తించి అదుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న చక్రహరి రామరాజు

**సైఫాబాద్, మే 25 ప్రభాతవార్త:** తెలంగాణ తొలి, మలి దశ తెలంగాణ ఉద్యమకారులను ప్రభుత్వం గుర్తించి తగు న్యాయం చేయాలని 1969 తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల సంఘం డిమాండ్ చేసింది. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చక్రహరి రామరాజు, సీనియర్ ఉపాధ్యక్షుడు వనం చంద్రమౌళి, ఉపాధ్యక్షుడు కె.సీతారామిరెడ్డి తదితరులు మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం 1969 ఉద్యమకారులను గుర్తించకపోగా, దగ్గరకు కూడా రానీయలేదని, ఆరోపించారు. 1969లో జరిగిన తెలంగాణ ఉద్యమంలో పోలీసుల దమన కాండ వల్ల 369 మంది కాల్పుల్లో మృతి చెందారని, వేలాది మంది గాయపడ్డారని, జైలుపాలైనారని, కుటుంబాలు, జీవితాలు చిన్నాభిన్నమైనాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. 3 వంతుల మంది లోకాన్ని విడిచిపెట్టి పోయారని, మిగిలి ఉన్న వారిలో అంతా 75 సంవత్సరాలకు పైబడినవారేనని వీరంతా ఆర్థికంగా, ఆనారోగ్యంతో ఆనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 1969 ఉద్యమ స్ఫూర్తితోనే మలిదశ ఉద్యమం కొనసాగి తెలంగాణను సాధించుకోవడం జరిగిందన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం 1969 ఉద్యమకారులను గుర్తించి గుర్తింపు కార్డులను పంపిణీ చేయాలని, 250 గజాల భూమిని కేటాయించాలని, నెలవారి గౌరవ భృతిని మంజూరు చేయాలని, ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో ఉచితంగా వైద్య సౌకర్యం కల్పించాలని, అలాగే ఉచితంగా రవాణ సౌకర్యం కల్పించాలని వారు డిమాండ్ చేశారు. తమ డిమాండ్లపై ఈ మేరకు కె.కేశవరావు, ప్రొఫెసర్ ఎం. కోదండరామ్‌లకు వినతి పత్రాలను అందజేశామన్నారు. ఈ సమావేశంలో సంఘం ప్రతినిధులు గోవు చలీనమ్మ, బంధు రుద్రమ్మ, ముట్టినేని వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

## సిఎంను కలిసిన కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్



రేవంత్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న రమేష్

**కెపిహెచ్‌బి కాలనీ, మే 25, ప్రభాతవార్త**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని టిపిసిసి ఉపాధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ సచివాలయంలో సోమవారం కలిశారు. బండి రమేష్ ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం కమ్మ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ముఖ్యమంత్రిని కలిసిన రమేష్ ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు. ముందుగా రమేష్ సీఎం రేవంత్‌కి పూల బొకే ఇచ్చి శాలువా కప్పి సన్మానించారు. తనపై విశ్వాసముంచి కార్పొరేషన్ చైర్మన్‌గా తనను నియమించినందుకు సీఎంకి రమేష్ కృతజ్ఞతలు తెలియజేశారు. సీఎం రేవంత్ రెడ్డి బండిరమేష్‌ను అభినందించారు. రాష్ట్రంలోని కమ్మసంఘాలన్నింటిని ఏక తాటిపైకి తీసుకువచ్చి రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధిలో భాగస్వామ్యం చేయాలని ఈ సందర్భంగా సీఎం సూచించారు. ఇచ్చిన పదవికి గౌరవం పెరిగేలా వన్నె తెచ్చేలా వ్యవహరించాలని కార్పొరేషన్ ద్వారా సంఘంలోని పేదల అభివృద్ధికి వారిలో రాజకీయ చైతన్యం తెచ్చేందుకు కృషి చేయాలన్నారు. పేద ప్రజల అభివృద్ధికి సంక్షేమానికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్ళేందుకు అటు కార్యకర్తలను ఇటు కార్పొరేషన్‌కు చెందిన ఆయా సంఘాలను, సభ్యులను సమన్వయం చేస్తూ ముందుకెళ్లాలని సీఎం సూచించినట్లు బండి రమేష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కమ్మ కార్పొరేషన్ డిప్యూటీ చైర్మన్ పరుచూరి మురళి తదితరులు పాల్గొన్నారు.

## వాహన లైట్లపై ప్రత్యేక డ్రైవ్ : ఏసిపి శంకరరాజు



ట్రాఫిక్ పోలీసులు నిర్వహిస్తున్న ప్రత్యేక డ్రైవ్.

**బేగంపేట మే 25,ప్రభాతవార్త**

అధిక ప్రకాశం కలిగిన లైట్ల వినియోగాన్ని నియంత్రించాలని, తిరుమలగిరి ట్రాఫిక్ ఏసీపీ జి.శంకరరాజు అన్నారు. మల్కాజ్ గిరి పోలీసు కమీషనర్ ఆదేశాల మేరకు అదనపు డీసీపీ ట్రాఫిక్ 1సూచనల మేరకు తిరుమలగిరి ట్రాఫిక్ ఏసీపీ జి.శంకరరాజు ఆధ్వర్యంలో సోమవారం అనధికార వాహన లైట్లపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ తనిఖీలలో అధిక ప్రకాశం కలిగిన డాజ్లింగ్ వాహన లైట్ల వినియోగాన్ని నియంత్రించడం కోసమే ఈ తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. ఇలాంటి లైట్ల వల్ల రాత్రి సమయంలో ఇతర వాహన దారులకు తీవ్ర అసౌకర్యం కలిగించడమే కాకుండా, తాత్కాలికంగా చూపు మందగింపుకు కారణమై రోడ్డు ప్రమాదాలకు దారి తీసే అవకాశం ఉందన్నారు. ఈ డ్రైవ్‌లో బేగంపేట ట్రాఫిక్ పోలీసుస్టేషన్ పరిధిలో 239కేసులు, తిరుమలగిరి ట్రాఫిక్ పోలీసుస్టేషన్ పరిధిలో 233కేసులు, అల్వాల్ ట్రాఫిక్ పోలీసుస్టేషన్ పరిధిలో 242కేసులు మొత్తం 714కేసులు నమోదు చేసామన్నారు. ప్రధానంగా హైబీమ్ అనధికార లైట్ల వినియోగం వాడటం వల్ల ఇతర వాహనదారులు ఇబ్బందులు పడుతారన్నారు. రోడ్డు భద్రత కోసం ట్రాఫిక్ నియమాలను తప్పని సరిగా పాటించాలని, అనధికార వాహన లైట్ల వినియోగాన్ని నివారించాలని ఏసీపీ జి.శంకరరాజు కోరారు. మల్కాజ్ గిరి ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో ఈ డ్రైవ్‌లను కొనసాగిస్తామని ఏసీపీ హెచ్చరించారు.



చాంద్రాయణగుట్ట దేవి దేవాలయంలో జరుగుతున్న అఖండ తాళసప్తాహంలో తెలంగాణ రాష్ట్ర శాసనసభ తొలి మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి, చాంద్రాయణగుట్ట ఇన్‌స్పెక్టర్ గోపిలు తుంబురా ధరించి, తాళలతో భజనలు చేశారు. ఆలయంలో అమ్మవారిని, పాండురంగ విఠలేశ్వరుని దర్శించుకున్నారు. నిర్వాహకులు వారిని శాలువతో ఘనంగా సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు.

## పార్టీ నియమావళికి కట్టుబడి పనిచేయాలి



సమావేశంలో పాల్గొన్న నేతలు

**సికింద్రాబాద్, మే 25 ప్రభాతవార్త:** సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయం వేదికగా సనత్ నగర్, ముషీరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గాలకు కొత్తగా నియమితులైన డివిజన్ అధ్యక్షులతో సోమవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు దీపక్ జాన్ నూతన నాయకులకు దిశానిర్దేశం చేస్తూ, పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్‌లో టీమ్ వర్క్, క్రమశిక్షణతో కూడిన సంస్కృతిని పెంపొందించుకోవాలని, ప్రతి ఒక్కరూ పార్టీ నియమావళికి కట్టుబడి పనిచేయాలని ఆయన స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పార్టీ శ్రేణుల్లో ఐక్యమత్యం ఉన్నప్పుడే అనుకున్న లక్ష్యాలను సాధించగలమని ఆయన చెప్పారు. దీనితో పాటు ఆయా డివిజన్ల పరిధిలో ప్రజలకు మరింత చేరువయ్యేలా తక్షణమే గ్రాస్‌రూట్ ఔట్‌రీచ్ (క్షేత్రస్థాయి) కార్యక్రమాలను ప్రారంభించాలని నూతన అధ్యక్షులకు దీపక్ జాన్ సూచించారు. నిరంతరం ప్రజల్లో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి పోరాడుతూ పార్టీ జెండాను మరింత ఎత్తుకు తీసుకెళ్లాలని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## రెనోవా, ఆర్వీఎం వైద్యవిద్యా సంస్థలతో అంబేద్కర్ వర్సిటీ అవగాహన ఒప్పందాలు



వైద్యవిద్యా సంస్థలతో ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న వర్సిటీ ఉపకులపతి ఆచార్య ఘంటా చక్రపాణి.

**జూబ్లీహిల్స్, మే 25, ప్రభాతవార్త:**

ఎం.బి.ఎ, హాస్పిటల్ హెల్త్ కేర్ మేనేజ్మెంట్ కోర్సును అందించడానికి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ప్రాంగణంలో ఉపకులపతి ఆచార్య ఘంటా చక్రపాణి సమక్షంలో రెనోవా ఇన్స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ కేర్ మేనేజ్మెంట్, రెనోవా సెంచరీ హాస్పిటల్స్, ఆర్వీఎం విద్యా సంస్థలతో సోమవారం వేర్వేరుగా అవగాహన ఒప్పందాలు చేసుకున్నారు. ఒప్పంద పత్రాలపై రెనోవా విద్యా సంస్థ ప్రిన్సిపాల్, డా. వజీహుద్దీన్ అహ్మద్ వారిస్, ఆర్వీఎం విద్యా సంస్థ ప్రిన్సిపాల్ పి. రవీందర్, విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ ఎల్. విజయ కృష్ణా రెడ్డి ఆధ్వర్యంలో సంతకాలు చేసుకొని ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ (అకడమిక్) ఆచార్య పుష్పా చక్రపాణి, డీన్ కామర్స్ బిజినెస్ మేనేజ్మెంట్ ఆచార్య ఐ. ఆనంద్ పవార్, ఆచార్య రాబింద్రనాథ్ సోలమన్, డా.వై. వెంకటేశ్వర్లు, ప్రొ.కిరణ్మయి, డా.పి. రాధాకృష్ణ పాల్గొన్నారు.

## పవర్ బోర్‌లకు మరమ్మతులు జరిపించండి



అంబర్‌నగర్‌లో పర్యటిస్తున్న స్వరూపాగౌడ్ ఇతర నేతలు

**సికింద్రాబాద్, మే 25 ప్రభాతవార్త:** పార్సిగుట్ట అంబర్‌నగర్ ఎల్ నారాయణ నగర్ బస్తీలలో గత అనేక నెలలుగా పవర్ బోర్లు, చేతి పంపులు పాడైపోయి నిరుపయోగంగా మారాయి వాటిని తక్షణమే మరమ్మతులు జరిపించాలని మాజీ కార్పొరేటర్ పి. స్వరూపాగౌడ్ అధికారులను కోరారు. పాడైపోయిన పవర్ బోర్‌లను అధికారులకు చూపించారు. అధికారులు వాటిని వెంటనే మరమ్మతులు జరుపడం కోసం ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే మహ్మద్‌గూడ నాలలో చాలా కాలంగా చెత్త నిలువలు పేరుకుపోయి తీవ్ర దుర్వాసన వ్యాపిస్తోందని, దీంతో స్థానికులు రోగాల బారిన పడుతున్నారని అమే తెలిపారు. కార్యక్రమంలో రవి ప్రసాద్ గౌడ్, ఓములు, బబ్లు, నాని, బాలయ్య గుప్తా, రాజు, శ్రీను పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

## హుస్నాబాద్‌లో న్యాయవాదుల నిరసన

**హుస్నాబాద్ రూరల్, మే 25, ప్రభాతవార్త :** హుస్నాబాద్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల 23న హైదరాబాద్‌లో సీనియర్ న్యాయవాది కాజా మొయినుద్దీన్ హత్యకు గురికావడం పట్ల న్యాయవాదులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా హుస్నాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సాయిని మల్లేశం మాట్లాడిన నిందితులను వెంటనే అరెస్ట్ చేసి ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. న్యాయవాదులపై పెరుగుతున్న దాడులను అరికట్టేందుకు ప్రత్యేక రక్షణ చట్టం అత్యవసరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు యాల శ్రీనివాస్‌రెడ్డి, మురళిమోహన్, ఒగ్గోజు సదానందం, కన్నోజు రామకృష్ణ, జుమ్లాల్ నాయక్, సురేష్, కిరణ్ కుమార్, శ్రీనివాస్, రవీందర్, శ్రీనివాస్, సంపత్, రాజశేఖర్, అజయ్, ప్రియా పాల్గొన్నారు.

## అంబేద్కర్ డెవలప్‌మెంట్ నూతన కమిటీ



గజ్వేల్ అంబేద్కర్ డెవలప్మెంట్ నూతన కమిటీ

**గజ్వేల్ టౌన్, మే 25 (ప్రభాతవార్త):** డాక్టర్ బిఆర్.అంబేద్కర్ డెవలప్‌మెంట్ నూతన కమిటీని గజ్వేల్‌లో ఎన్నుకోవడం జరిగింది.కమిటీ నూతన అధ్యక్షునిగా మస్కూరి కిష్టయ్య, ప్రధాన కార్యదర్శిగా బొల్లారం ఎల్లయ్య, ఉపాధ్యక్షులుగా మన్నె కృష్ణ, మాచపురం బాల్‌నర్సయ్య, పొట్ట యాదగిరి, సహాయ కార్యదర్శులుగా పంబాల ఎల్లయ్య, సల్ల నాగయ్య, మైస స్వామి, కోశాధికారిగా పంబాల సత్యనారాయణ, సలహాదారులుగా మల్కగళ్ల నాగయ్య, దమ్మని మల్లయ్య, కార్యవర్గ సభ్యులుగా మైసని మల్లయ్య, సంఘయోళ్ల నర్సింలు, చింతకింది బాలయ్య, గౌరవ అధ్యక్షులుగా అటకూరి రాములులను ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గజ్వేల్ మండలంలోని అన్ని గ్రామాలను సందర్శించి సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా వెనుకబాటుతనాన్ని అణచివేసే సామాజిక అసమానతలను రూపుమాపుటకు ఈ నూతన కమిటీ కట్టుబడి ఉంటుందని తీర్మానించుకోవడం జరిగిందని తెలిపారు.

## రోడ్డు విస్తరణలో స్థలం కోల్పోయినవారికి న్యాయం చేయాలి : సంతోష్

**గజ్వేల్ టౌన్, మే 25 (ప్రభాతవార్త):** రోడ్డు విస్తరణలో స్థలం కోల్పోయినవారికి టిడిఆర్ ద్వారా న్యాయం చేయాలని బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్సి. సంతోష్ అన్నారు. సోమవారం గజ్వేల్‌లో ఆయన మాట్లాడుతూ గజ్వేల్ ప్రాంతాన్ని ఇటీవల హెచ్ఎండిఏ లిమిట్స్‌లో చేర్చడం వల్ల ఇక్కడ రోడ్డు విస్తరణలో స్థలాలు, ఇళ్ల కోల్పోయిన బాధితులకు ఇదొక మంచి అవకాశం అన్నారు. గతంలో(టిడిఆర్) సర్టిఫికెట్లు కేవలం కార్పొరేషన్ పరిధిలోని ప్రాంతాలకే పరిమితం కావడం వల్ల ఇప్పట్లో మనం ఈ సర్టిఫికెట్లు ఇవ్వలేకపోయామని, కానీ ఇప్పుడు బాధితులకు మార్కెట్ వాల్యూ కంటే 400 శాతం(నాలుగు రెట్లు) లబ్ధిచేకూరేలా జివోలు ఉన్నాయని తెలిపారు. పాలకవర్గం ఈ విషయమై సంబంధిత అధికారులతో మాట్లాడి బాధితులకు లబ్ధి చేకూరేవిధంగా మున్సిపాలిటీలోని(టిపిఎస్) సెక్షన్ అధికారులతో ఒక కమిటీ వేసి బాధితుల వివరాలు సేకరించాలని కోరారు. అలాగే రోడ్డు విస్తరణలోని బాధితులకు గత నాయకులు ఇచ్చిన హామీ ప్రకారం వారి ఇంటి నిర్మాణ అభివృద్ధిలో బాధితులందరికీ న్యాయం జరిగేలా కృషి చేయాలని అన్నారు.

## జాతీయ రహదారిపై రైతుల ధర్నా

**హుస్నాబాద్ రూరల్/ కోహెడ, మే 25, ప్రభాతవార్త :** కోహెడ మండలం సముద్రాల గ్రామంలోని ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద సోమవారం రైతులు ఆందోళనకు దిగారు. రెండు నెలలు గడుస్తున్నా ధాన్యం కొనుగోలు చేయడం లేదని ఆరోపించారు. కొనుగోలు కేంద్రం వద్ద లారీల కొరత కారణంగా ధాన్యం కుప్పలు పేరుకుపోవడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఎండలు, అకాల వర్షాల భయంతో ధాన్యం నష్టపోతుందనే ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఆగ్రహించిన రైతులు సిద్దిపేట-ఎల్కతుర్తి నేషనల్ హైవేపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. రైతుల ఆందోళనతో భారీగా వాహన రాకపోకలు నిలిచిపోయి రోడ్డుపై కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. వెంటనే ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలని, కొనుగోలు కేంద్రానికి తక్షణమే లారీలను ఏర్పాటు చేయాలని రైతులు ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. అధికారుల నిర్లక్ష్యమే సమస్యకు ప్రధాన కారణమని రైతులు ఆరోపించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని రైతులతో చర్చలు జరిపి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. అధికారులు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

## వరి కొయ్యలను కాల్చవద్దు..భూమిలో కలియదున్నాలి

**జగదేవ్‌పూర్, మే 25 (ప్రభాతవార్త):** రైతులు సాగుచేసిన వరి పంట అవశేషాలను కాల్చవద్దని, పొలంలోనే కలియదున్నాలని మండల వ్యవసాయాధికారి యు.వసంతరావు అన్నారు. మండలంలో యాసంగి సాగులో భాగంగా 10,500 ఎకరాలలో వరి సాగు, 2,650 ఎకరాలలో మొక్కజొన్న సాగు చేశారని, వాటి అనంతరం రైతులు అక్కడక్కడ పంట అవశేషాలను కాలుస్తున్నారని, దీనివల్ల భూసారం తగ్గి సేంద్రీయ కర్బనం దెబ్బతింటుందని అన్నారు. అదేవిధంగా పర్యావరణం దెబ్బతిని ఆరోగ్యంపై తీవ్రమైన దుష్ప్రభావాలు ఏర్పడుతాయన్నారు. అందుకనే రైతులందరూ పంట అవశేషాలను భూమిలోనే కలియదున్నాలన్నారు.

## నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

**రాయపోల్, మే 25 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల విక్రయ దుకాణాలలో టాస్క్‌ఫోర్స్ అధికారులు సోమవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. మండల కేంద్రంలోని ఆగ్రో రైతు సేవా కేంద్రం-1, అడిషనల్ ఆగ్రో రైతు సేవా కేంద్రం-2తోపాటు అనాజీపూర్‌లోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ట్రేడర్స్ దుకాణాలను అధికారులు పరిశీలించారు. ఈ తనిఖీలో మండల వ్యవసాయ అధికారి ఆర్.నరేష్ మరియు స్థానిక ఎస్ఐ కె.మానస సంయుక్తంగా పాల్గొన్నారు. దుకాణాల్లో విత్తనాలు, ఎరువులు, పురుగుమందులకు సంబంధించిన లైసెన్సులు, స్టాక్ రిజిస్టర్లు, బిల్లు పుస్తకాలు తదితర రికార్డులను పరిశీలించారు. లైసెన్స్ కలిగిన కంపెనీలకు చెందిన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులనే విక్రయించాలని, ధరల పట్టికలు మరియు స్టాక్ వివరా లను షాపుల ముందు తప్పనిసరిగా ప్రదర్శించాలని డీలర్లకు సూచించారు. రైతులకు విక్రయించే ప్రతి వస్తువుకు రశీదు ఇవ్వడం తప్పనిసరి అని, ఆ రశీదులపై రైతుల సంతకాలు తీసుకోవాలని ఆదేశించారు. నకిలీ విత్తనాలు విక్రయించినట్లయితే పిడి చట్టం క్రింద కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. అదేవిధంగా అధిక ధరలకు విక్రయించడం, గడువు ముగిసిన లేదా వాలిడిటీ లేని విత్తనాలను అమ్మడం వంటి చర్యలకు విత్తన చట్టం-1966 ప్రకారం కేసులు నమోదుచేసి శిక్షిస్తామని స్పష్టం చేశారు.

## ప్రశాంతంగా ముగిసిన టిజిపిఎస్‌సి పరీక్షలు

**వర్గల్, మే 25 (ప్రభాతవార్త):**

టిజిపిఎస్‌సి విభాగీయ పరీక్షలు 2026 మే 23 నుండి 30 వరకు నిర్వహించగా, సోమవారం కావేరి విశ్వవిద్యాలయంలో నిర్వహించిన పరీక్షలు విజయవంతంగా పూర్తయ్యాయి. ఉదయం నిర్వ హించిన సెషన్ పరీక్షకు కేటాయించిన మొత్తం 180 మంది అభ్యర్థుల్లో 149 మంది హాజరు కాగా, మధ్యాహ్నం సెషన్‌లో కేటాయించిన మొత్తం 131 మంది అభ్యర్థుల్లో 116 మంది పరీక్షకు హాజరయ్యారు.

# చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం

### సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి



కోహెడలోవరి ధాన్యం కొనుగోలు తీరును పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ హైమావతి

కోహెడ/చేర్యాల, మే 25, ప్రభాతవార్త : జిల్లాలో ధాన్యం కొనుగోలు వేగంగా జరుగుతుందని రైతులు సంయమనం పాటిస్తూ అధికారులకు సహకరించాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె.హైమావతి సూచించారు. సోమవారం కోహెడ మండలంలోని వెంకటేశ్వరపల్లిలోని ఆధునిక మార్కెట్ కమిటీ, చేర్యాల పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీలోని గోదాములో ధాన్యం దిగుమతి ప్రక్రియను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ హైమావతి మాట్లాడుతూ జిల్లాలో ధాన్యం కొనుగోలు సజావుగా సాగుతుందని వేగవంతం చేయడానికి మిల్లులకు కాకుండా అందుబాటులో ఉన్న గోదాంలో ప్రస్తుతానికి దిగుమతి చేస్తున్నామని తెలిపారు.కోహెడలోని గోదాం వద్ద ధాన్యం ట్రాక్టర్ లైన్ చాలా పెద్దదిగా ఉన్నందున ప్రతి ట్రాక్టర్‌కి టోకెన్ ఇచ్చి ఒక ప్రణాళిక ప్రకారం వేగంగా దిగుమతి చేసేలా పని చేయాలని మార్కెట్ కమిటీ, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. అనంతరం చేర్యాల ఎఎంసిలో ధాన్యాన్ని మొత్తం గోదాములో దిగుమతి చేసిన తర్వాతనే వేరే సెంటర్‌ల నుంచి వచ్చే ధాన్యాన్ని దిగుమతి చేయాలని ఆదేశించారు. రైతులు పండించిన చివరి గింజను కొనుగోలు చేస్తామన్నారు. హమాలీ, లారీల కొరత ఉన్నందున కొంత జాప్యం జరుగుతున్న వేగం చేయడానికి అధికార యంత్రాంగం శాయశక్తులా పని చేస్తుందన్నారు.

### ఆహార బుట్టలను పంపిణీ...

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

క్షయ వ్యాధి అంతం మనందరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ కె.హైమావతి అన్నారు. జిల్లా కేంద్రంలోని నాసర్‌పురా అర్బన్ హెల్త్ సెంటర్‌లో బెజ్జంకి మండలం పోతారం గ్రామానికి చెందిన వైట్ ఫీల్డ్ బయో ప్రొడక్ట్స్ ప్రైవేటు లిమిటెడ్ ఆధ్వర్యంలో సోమవారం టీబీ పేషెంట్లకు డిఎం అండ్ హెచ్ఓ ధనరాజ్‌తో కలిసి బాస్కెట్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాను క్షయ రహిత జిల్లాగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. క్షయ వ్యాధితో బాధపడుతున్న వారు కుటుంబ సభ్యులకు, సమాజానికి రాకుండా జాగ్రత్తలు తీసుకొని మంచి పోషక విలువలు ఉన్న ఆహారాన్ని తీసుకోవడం వల్ల వ్యాధి నిరోధక శక్తి పెరగడంతో క్షయ వ్యాధి పూర్తిగా నయమవుతుందన్నారు. జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ గణేష్‌రామ్, వైట్ ఫీల్డ్ బయో ప్రొడక్ట్స్ ప్రైవేటు లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శివాజీ నాల్కర్ సౌజన్యంతో క్షయ వ్యాధిగ్రస్తులకు ఏడు రకాల పోషక విలువలు ఉన్న ఆహార బుట్టలను(ఫుడ్ బాస్కెట్) పంపిణి చేపట్టిందన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ నిర్మలరెడ్డి, డాక్టర్ వినోద్ బాబ్జి, డాక్టర్ శ్రీకాంత్, డెమో నవీన్‌రాజ్, సత్యనారాయణ, సూపర్‌వైజర్లు రాజేందర్, రమణ,రాజు,మల్లయ్య, తిరుపతిరెడ్డి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ సంగీత

## ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం వద్దు

### అడిషనల్ కలెక్టర్ సంగీత

**సంగారెడ్డి మున్సిపాలిటీ, మే 25, ప్రభాతవార్త :** ప్రజావాణిలో ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదును సత్వరంగా, పారదర్శకంగా పరిష్కరించే దిశగా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని అడిషనల్ కలెక్టర్ సంగీత అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం ప్రదర్శించకుండా, నిర్ణీత గడువులోగా చర్యలు పూర్తి చేయాలని సూచించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ సంగీత ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుంచి వివరాలు తెలుసుకుని సంబంధిత శాఖల అధికారులకు తగిన సూచనలు జారీ చేశారు.ఈ సందర్భంగా ఆమె ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.జిల్లాలో డివిజన్ వారీగా నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమాల్లో మొత్తం 102 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. అందులో కలెక్టరేట్‌కు 44, సంగారెడ్డి డివిజన్‌కు 17, ఆందోల్ డివిజన్‌కు 07, నారాయణఖేడ్ డివిజన్‌కు 16, జహీరాబాద్ డివిజన్‌కు 18 ఫిర్యాదులు అందినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, రెవెన్యూ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## దేవాలయాల పరిరక్షణకు ప్రభుత్వం కృషి

**కెపిహెచ్‌బి కాలనీ, మే 25, ప్రభాతవార్త**

కాంగ్రెస్ ప్రభుత్వం దేవాలయాల పరిరక్షణ కోసమే నిరంతరం పనిచేస్తుందని తెలంగాణ కమ్మ కార్పొరే షన్ చైర్మన్, టీపీసీసీ ఉపాధ్యక్షులు కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ పేర్కొన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలోని మూసాపేట్ లక్ష్మికళ సినిమా హాల్ సమీపంలో ఉన్న శ్రీశ్రీశ్రీ నల్ల పోచమ్మ అమ్మవారి ఆలయంలో నూతన ఆలయ కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన ఆలయ కమిటీ చైర్మన్‌గా రాచమల్ల బిక్షపతి గౌడ్, కమిటీ సభ్యులుగా కావాలి పాండు, ఎం.రమేష్, మెట్టు వినోద్, పి.నర్సింగ్‌రావు, నోముల బాబు రావులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ బీ బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, ఏ బ్లాక్ అధ్యక్షులు పటోళ్ల నాగిరెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు లక్ష్మయ్య, గొట్టిముక్కల వెంకటేశ్వర్ రావు, గాలి బాలాజీ, కోపిశెట్టి దినేష్ కుమార్, గంధం రాజు, నియోజకవర్గ ఓబీసీ అధ్యక్షులు తూము సంతోష్, రాచమల్ల శేఖర్‌గౌడ్ పాల్గొన్నారు.

## పురస్కారాలు బాధ్యతను పెంచుతాయి : డా. నందిని సిధారెడ్డి

**రవీంద్రభారతి, మే 25 ప్రభాతవార్త :** సాహిత్య రంగంలో పురస్కారాలు గొప్ప ప్రభావం చూపెడ తాయని, లక్ష్యం, బాధ్యతను ఎంతగానో పెంచుతాయని కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత, తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి అధ్యక్షుడు డా. నందిని సిధారెడ్డి అన్నారు. పి.సునీతారావు స్మరణలో విజయేందర్‌రావు తన ఫౌండేషన్ ద్వారా ప్రముఖ సాహితీవేత్తలకు ప్రతీయేటా పురస్కారాలు అందజేయ డం హర్షదాయకం, స్ఫూర్తిదాయకమని ప్రశంసించారు. రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు డా. ఏనుగు నరసింహారెడ్డి సభాధ్యక్షతన జరిగిన సునీతారావు 5వ వార్షికోత్సవ సాహిత్య పురస్కార సభకు ముఖ్యఅతిథిగా విచ్చేసి డా. నందిని సిధారెడ్డి విశిష్ట అతిథులు డా. యాకూబ్, డా. ఎస్.రఘు, ఎ.లక్ష్మీపతి, పి.శ్రీనివాసరావు, బివిఎన్.స్వామి, డా. వి.శ్రీధర్, డి.వీణావాణి, ఫౌండేషన్ చైర్మన్ పి.విజయేందర్‌రావు, పురస్కార కమిటీ కన్వీనర్ డా. కె.గోవర్ధన్‌రాజు తది తరులతో కలిసి వివిధ ప్రక్రియల్లో ప్రముఖ సాహి తీవేత్తలు డా. బాణాల శ్రీనివాసరావు, జి.ఉమామహేశ్వర్, స్వర్ణ కిలారి, బండారి రాజకుమార్‌లకు పీచర సునీతారావు ఐదవ వార్షిక సాహిత్య పురస్కారాలు- 2026లను ప్రదానంచేసి శుభాభినందనలు తెలిపారు. గ్రహీతలకు పురస్కారంతోపాటు ఒక్కొక్కరికి 15వేల రూపాయల నగదు, ప్రశంసాపత్రం, శాలువాతో ఘనంగా సత్కరించారు. చివరిగా పురస్కార గ్రహీతలు తమ స్పందనను తెలిపారు.

## ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు ఏర్పాటు చేయాలి : మహేష్ గుప్తా

**నిజాంపేట్, మే 25, ప్రభాతవార్త**

ప్రగతి నగర్ కాకతీయ హిల్స్, అలీప్ సర్కిల్ ప్రాంతాల్లో పెరుగు తున్న ట్రాఫిక్ రద్దీ నేపథ్యంలో ప్రజల భద్రత కోసం వెంటనే ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు నిర్మించాలని అల్లాడి మహేష్ గుప్తా సోమవారం నిజాంపేట్ మున్సిపల్ కమిషనర్ సాబేర్ అలీకి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజూ వేలాది మంది ప్రజలు, ముఖ్యంగా విద్యార్థులు, చిన్నారులు ప్రాణా లను పణంగా పెట్టుకుని రోడ్లు దాటుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వేగంగా దూసుకెళ్తున్న వాహనాల కారణంగా ప్రమాదాల ముప్పు రోజురోజుకు పెరుగుతోందని పేర్కొన్నారు. ఎలాంటి అపరిస్థితులు తలెత్తకముందే అధికారులు స్పందించి ప్రజల రక్షణ కోసం తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.ప్రజల సౌకర్యం, భద్రత దృష్ట్యా ఫుట్ ఓవర్ బ్రిడ్జిల నిర్మాణం అత్యవసరమని పేర్కొంటూ సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్ర మంలో ఉప్పల వంశీ కిషోర్ గుప్తా, పాంపాటి రాజేష్, సాయి కిరణ్, నిజాం వంశీ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలు యువత భవిష్యత్తుకు మార్గం : జాలిగం రాకేష్

**జీడిమెట్ల, మే 25, ప్రభాతవార్త**

కుత్బుల్లాపూర్ పరిధిలోని హనుమాన్ క్రికెట్ గ్రౌండ్స్‌లో సోమవారం నిర్వహించిన వీకెండ్ క్రికెట్ టోర్నమెంట్‌లో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు జాలిగం రాకేష్ పాల్గొని యువతతో కలిసి సందడి చేశారు. టోర్నమెంట్ సందర్భంగా ఆటగాళ్లను ఉత్సాహపరుస్తూ క్రీడల ప్రాముఖ్యతపై ఆయన మాట్లాడారు.ఈ సందర్భంగా జాలిగం రాకేష్ మాట్లాడుతూ, క్రికెట్ కేవలం ఆట మాత్రమే కాకుండా యువతలో క్రమశిక్షణ, ఐక్యత, సహనం, నాయకత్వ లక్షణాలను పెంపొందించే వేదిక అని పేర్కొన్నారు. క్రీడలు యువతను శారీరకంగా, మానసికంగా దృఢంగా తీర్చిదిద్ద డంతో పాటు పోటీతత్వాన్ని పెంచుతాయని తెలిపారు. టోర్న మెంట్‌ను విజయవంతంగా నిర్వహించిన ప్రవీణ్, పండు, కిరణ్, సంతోష్, యూసఫ్‌లను ప్రత్యేకంగా అభినందించిన ఆయన, ఇలాంటి క్రీడా కార్యక్రమాలు యువతను మంచి మార్గంలో నడిపి స్తూ సమాజ అభివృద్ధికి దోహదపడతాయని అన్నారు.

## పేదలకు సేవలు అందించేందుకు యువత ముందుకు రావాలి : ఎమ్మెల్యే శ్రీగణేష్

**కంటోన్మెంట్,మే 25 ప్రభాతవార్త:** పేద ప్రజలను, రోగులను హక్కున చేర్చుకొని పలు సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు స్వచ్ఛంద సంస్థలు, విద్యావంతులు,నాయకులు ముందుకు రావాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్. శ్రీగణేష్ తెలిపారు. 2వ వార్డుకు చెందిన జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జి.శ్యామన్‌రాజు ఆధ్వ ర్యంలో సోమవారం అన్నా నగర్‌లో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. మానవ సేవే మా ధ్యేయం అనే నినాదంతో కొన్ని సంవత్సరాల నుంచి ఎస్.జి.ఎఫ్.సంస్థను ఏర్పాటు చేసిన కంటోన్మెంట్‌లో అనేక కార్యక్రమాలు చేపట్టామ న్నారు. అదే విధంగా ఆర్థికంగా నిలదొక్కుకున్న వారు పలుసేవా కార్యక్రమాలు చేపట్టేందుకు ముందుకు రావాలన్నారు. ఈ సందర్భంగా వైద్య పరీక్షలు చేయించుకున్న రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

**కార్ఖానలో...** 3వ వార్డు కార్ఖానలోని వివిధ బస్తీలలో ఎమ్మె ల్యే శ్రీగణేష్ పర్యటించి నప్రజా సమస్యలు అడిగి తెలుసు కున్నారు. తన దృష్టికి వచ్చిన సమస్యలను త్వరిత గతిన పరిష్క రించేందుకు కృషి చేస్తామన్నారు.

## బిఆర్ఎస్‌ను మరింత పటిష్టం చేయాలి : ఎమ్మెల్యే తలసాని

**కంటోన్మెంట్,మే 25 ప్రభాతవార్త:** బిఆర్ఎస్ కార్యకర్తలు, నాయకు లు సమన్వయంతో వ్యవహరిస్తూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అనుస రిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీని మరింత బలోపేతం చేయాలని మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మె ల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ సూచించారు. సోమవారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని తలసాని క్యాంప్ కార్యాలయంలో కంటోన్మెంట్ బిఆర్ఎస్ ఇన్‌ఛార్జి మన్నెక్రిషాంక్, ముఖ్య నేతలతో తలసానిని కలిసి పార్టీ వ్యవహారాలపై చర్చించారు. ఈ నెల 31న కంటోన్మెంట్ నియోజకవర్గ సమావేశానికి పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని సూచించారు. వచ్చే నెల 1న నిర్వహించనున్న పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని సమన్వయంతో పనిచేసి సభ్యత్వనమోదు కార్యక్రమాన్ని బారీ ఎత్తున నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి, బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ చైర్మన్ టీ.ఎన్. శ్రీనివాస్,మాజీ బోర్డు మెంబర్లు పాండు యాదవ్, అనితాప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## అడ్డగుట్టలో తహసీల్దార్ కార్యాలయ భవనం నిర్మించాలి

**అడ్డగుట్ట,మే 25 ప్రభాతవార్త:**

అడ్డగుట్టలో 50 పడకల ఆసుపత్రి నిర్మాణం కోసం కెటాయించిన స్థలంలో మారేడ్‌పల్లి తహశీల్ కార్యాల యం భవనం నిర్మించాలని కోరుతూ అడ్డగుట్ట సమగ్రా భివృద్ధి,ప్రజా సంక్షేమ సంఘం కమిటీ అధ్యక్షులు ఎం.అజయ్ బాబు, కార్యదర్శి జయప్రకాశ్‌లు సోమవారం హైదరాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయం లోని ప్రజా వాణిలో వినతిపత్రం అందజేశారు.

## పొద్దు తిరుగుడు కొనుగోలు ప్రారంభం

**చిన్నకోడూరు, మే 25, ప్రభాతవార్త :** కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల నెలరోజులుగా నిలిచిపోయిన పొద్దుతిరుగుడు కొనుగోలు ఎట్టకేలకు ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి చొరవతో తిరిగి ప్రారంభమైనట్లు ఎఎంసి చైర్మన్ మీసం మహేందర్‌యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోనే అత్యధికంగా పొద్దుతిరుగుడు చిన్నకోడూరు మండలంలోనే రైతులు సాగుచేస్తారని తెలిపారు. నెల రోజులుగా పొద్దుతిరుగుడు కొనుగోలు చేయకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, వ్యవసాయశాఖ మంత్రి, మాజీ ఎమ్మెల్యే హన్మంతరావు దృష్టికి తీసుకెళ్లామన్నారు. వెంటనే స్పందించిన వారు కేంద్రంతో మాట్లాడి కొనుగోలు ప్రారంభించేలా చర్యలు తీసుకున్నారని తెలిపారు. రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలోనే అమ్ముకుని మద్దతు ధర పొందాలన్నారు. కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించడానికి సహకరించిన మంత్రులు, మాజీ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

## 4న శ్రీమద్భాగవత సప్తాహ జ్ఞానయజ్ఞం

**మర్కుక్, మే 25 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని భావానందపూర్‌లో గల శ్రీ పాండురంగ ఆశ్రమంలో జూన్ 4వ తేదీ నుండి 10వ తేదీ వరకు పురుషోత్తమ మాసం పురస్కరించుకొని శ్రీమద్భాగవత సప్తాహ జ్ఞానయజ్ఞము నిర్వహించడం జరుగుతుందని ఆశ్రమ నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి అభినవ శుక, బ్రహ్మశ్రీ తంగిరాల రాజేంద్ర ప్రసాద్‌శర్మ విచ్చేసి ప్రవచనములు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి భక్తులు పెద్దసంఖ్యలో హాజరై శ్రీ పాండురంగ స్వామిని దర్శించుకొని స్వామివారి కృపకు పాత్రులు కాగలరని కోరారు.

## సిసి రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ



సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ చేస్తున్న సర్పంచ్

**చిన్నకోడూరు, మే 25, ప్రభాతవార్త :** మండల పరిధిలోని మైలారం బీసీ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను సోమవారం సర్పంచ్ సరిత హరీష్ భూమి పూజ చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాభివృద్ధియే తమ ధ్యేయమన్నారు. గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ పార్టీలకు అతీతంగా సహకరించాలన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, ప్రజలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎల్లమ్మ దేవాలయంలో హరీష్‌రావు పూజలు

**సిద్దిపేట రూరల్, మే 25, ప్రభాతవార్త :** సిద్దిపేట నియోజకవర్గంలోని వివిధ మండలాలలో సోమవారం నిర్వహించిన దేవాలయ ఉత్సవాల్లో మాజీ మంత్రి, బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్‌రావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నారాయణరావుపేట మండలం మల్యాలలో ఎల్లమ్మ దేవాలయంలో నిర్వహించిన ఉత్సవాలలో ఆయన పాల్గొని అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.సిద్దిపేట అర్బన్ మండలం మందపల్లిలో జరుగుతున్న పెద్దమ్మ తల్లి పంచమ వార్షికోత్సవంలో ఆయన పాల్గొని అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్నకోడూరు మండలం కిష్టాపూర్‌లో రేణుక ఎల్లమ్మ దేవాలయంలో నిర్వహించిన కళ్యాణ మహోత్సవానికి మాజీ మంత్రి హరీష్‌రావు హాజరయ్యారు. అనంతరం అమ్మవారి కళ్యాణంలో పాల్గొని పూజలు నిర్వహించారు. చిన్నకోడూరు మండలం రామంచలో జరిగిన ఎల్లమ్మ ఉత్సవాలకు హరీష్‌రావు హాజరయ్యారు.అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఆయన వెంట పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## లారీలను ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తరలింపు



ధాన్యం తరలింపునకు టోల్‌ప్లాజా వద్ద లారీలను పట్టుకున్న అధికారులు

**కొండపాక, మే 25, ప్రభాతవార్త :** ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి రైస్‌మిల్లులకు తరలించడానికి లారీల కోసం సోమవారం పోలీసులను ఆశ్రయించిన గిరాయిపల్లి సర్పంచ్ కాసాపూరం సంజీవరెడ్డి, రైతులు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభం అవుతున్న కొనుగోలు కేంద్రంల్లో, కల్లాల్లో పెరుకుపోయి కుప్పలు కుప్పలుగా ఉన్న ధాన్యాన్ని చూసి రైతులు ఆవేదన చెందుతున్నారన్నారు. పంట నష్టపోకుండా ఉండడానికి రైతులు, సర్పంచ్ కలసి కుకునూరుపల్లి పోలీసులను ఆశ్రయించినట్లు ఆయన తెలిపారు. పోలీసులు చొరవ తీసుకొని రాజీవ్ రహదారిపై దుద్దెడ శివారులోని టోల్‌ప్లాజా వద్ద లారీలను ఆపి గిరియిపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రానికి పంపించినట్లు ఆయన వివరించారు. వర్షాకాలం ప్రారంభం అవుతున్న కారణంగా అధికారుల చర్యలు తీసుకొని ధాన్యాన్ని కొనుగోలు చేసి వెంట వెంటనే మిల్లుకు తరలించే ఏర్పాట్లను చేయాలని కోరారు. అధికారుల సరైన చర్యలుతీసుకోకపోతే కలెక్టరనకార్యాలయం ముందు ధర్నా చేపడతామని రైతులు హెచ్చరించారు. అనంతరం లారీ ఓనర్లు, డ్రైవర్లు మాట్లాడుతూ పోలీసులు, రెవెన్యూ అధికారులు ధాన్యం కొనుగోలు సమయంలో మమ్మల్ని అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండి వాపోయారు.

## ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

**కంటోన్మెంట్,మే 25 ప్రభాతవార్త:** ఆర్టీసీలో పనిచేసి పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు రావాల్సిన పెండింగ్ బకాయిలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఆర్టీసీ కంటో న్మెంట్ డిపో ముందు ధర్నా నిర్వహించారు. 2017 నుంచి 2024 వరకు రావాల్సిన బకాయిలను తక్షణమే చెల్లించాలన్నారు. అదే విధంగా రిటైర్డ్ ఉద్యోగులకు తార్నాక ఆసుపత్రిలో మెడికల్ సౌక ర్యాలు కల్పించాలని, సూపర్ లగ్జరీ బస్సుల్లో ప్రయాణం చేసేందుకు అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ డిపోకు చెందిన రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నేతలు కిషోర్ కుమార్,దుర్గయ్య, పిసీ.మౌలి, కె.ఎం.ఎస్ .రెడ్డి, సాంబశివరావ్,ఉషారాణి, డి.కె.సుజాత తదితరులు పాల్గొన్నారు.

## కెటిఆర్ సభకు బిఆర్ఎస్ నేతలు

**యూసుఫ్‌గూడ మే 24 ప్రభాతవార్త :**

బీఆర్ఎస్ పార్టీకి నాయకులతో పాటు కార్యకర్తలు కష్టకాలంలో వెన్నంటి ఉన్నారని అల్లాపూర్ మాజీ కార్పొరేటర్ సబీహా గౌసుద్దీన్ అన్నారు. నియోజకవర్గం లోని ఎన్‌కేఎన్ గార్డెన్‌లో సోమవారం నియోజకవర్గం శాసనసభ్యుడు మాదవరం కృష్ణారావు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల వస్మృస్థాయి సమావేశం నిర్వ హించారు. అల్లాపూర్ డివిజన్ పరిధి నుంచి మాజీ కార్పొరేటర్ సబీహా గౌసుద్దీన్ ఆధ్వర్యంలో గాయిత్రి నగర్‌లోని పార్టీ కార్యాలయం నుంచి ప్రతి బస్తీకి చెందిన కార్యకర్తలు నాయకులతో కలిసి డివిజన్ నుంచి సమావేశానికి భారీ ఎత్తున తరలి వెళ్లారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కార్యకర్తలను ఉద్దేశించి రాబోయే రోజుల్లో తప్పకుండా బీఆర్ఎస్ పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అంతే కాకుండా నియోజకవర్గంలోని కార్పొరేటర్లు, కార్యకర్తల ను ప్రత్యేకంగా అభినందించారు. ఎంతో మంది పార్టీ వీడి వెళ్లిపోయినప్పటికి కష్టకాలంలో కూడా నియోజ కవర్గం కార్పొరేటర్లు పార్టీలోనే నిలబడి పనిచేస్తున్నారని ప్రశంసించారు.కార్యక్రమంలో నియోజకవర్గం అధ్యక్షులు మహ్మద్ గౌసుద్దీన్, నాగుల సత్యం, బొల్లు శ్రీనివాసరా వు, మధుసుదన్, ఆవుల సంజీవ, రాజు చారి, రవీం దర్‌రెడ్డి నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు.

# సమస్యలను పరిష్కరించడమే ధ్యేయంగా ముందుకు సాగాలి

### పద్మశాలి కో-ఆపరేటివ్ చైర్మన్ శ్రీనివాస్‌కు సిఎం రేవంత్‌రెడ్డి సూచన

**సిద్దిపేట అర్బన్, మే 25, ప్రభాతవార్త :**

రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి పద్మశాలీల సమస్యలను తెలుసుకుని పరిష్కరించడమే ధ్యేయంగా ముందుకు సాగాలని సిఎం ఎనుముల రేవంత్‌రెడ్డి సూచించినట్లు పద్మశాలి కో-ఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ గూడూరి శ్రీనివాస్ తెలిపారు. తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర పద్మశాలి కో-ఆపరేటివ్ చైర్మన్‌గా నియమించినందులకు సోమవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సిఎం ఎనుముల రేవంత్‌రెడ్డి పద్మశాలీల సమస్యలు,సిద్దిపేట నియోజక వర్గ సమస్యలతోపాటు పార్టీ పరిస్థితిపై కొద్ది సేపు చర్చించినట్లు గూడూరి శ్రీనివాస్ వివరించారు. పద్మశాలీల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులకు అందేలా చూడాలని సూచించినట్లు తెలిపారు.

సిద్దిపేట నియోజకవర్గం లోని సమస్యలను తన దృష్టికి తీసుకరావాలని పార్టీని మరింత బలోపేతం చేయడానికి ప్రతి ఒక్కరూ సైనికుల్లా కృషిచేయాలని తెలిపినట్లు పేర్కొన్నారు. అనంతరం పద్మశాలి కో-ఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ పద్మశాలి యువతకు ఉపాధి అవకాశాలను కల్పించడానికి సిఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో త్వరలో ప్రత్యేక కార్యక్రమం అమలు చేయడం జరుగుతుందన్నారు. పద్మశాలి కో-ఆపరేటివ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో పద్మశాలి కోసం స్టడీ సెంటర్‌ను ఏర్పాటు చేయడా నికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.సిఎం రేవంత్‌రెడ్డి సర్కార్ రాష్ట్రంలో పద్మశాలీల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతుందన్నారు.



సిఎం రేవంత్‌రెడ్డిని సత్కరిస్తున్న శ్రీనివాస్



ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న దృశ్యం

## అసైన్డ్ భూముల అక్రమ అమ్మకాలపై ఫిర్యాదు

**నాగల్‌గిద్ద, మే 25, ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఔదత్‌పూర్‌లో అసైన్డ్ భూములను సేల్ డీడ్ చేసి అక్రమంగా దళారులతో కలిసి అమ్మకపు రిజిస్ట్రేషన్ చేస్తున్న రెవిన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని అబ్దుల్ రహీం సోమవారి నిర్వహించిన ప్రజావాణిలో లిఖిత పూర్వకంగా నారాయణఖేడ్ డిప్యూటీ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామంలోని సర్వే నంబరర్ 12, 15లో సబ్ రిజస్టర్, తహసీల్దార్‌లతో కలిసి కొందరు అక్రమార్కులు కుమ్మకై ప్రభుత్వ సీలింగ్ భూములను సేల్ డీడ్ అమ్మకాలు చేస్తుండటంపై పలు మార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా అధికారులపై చర్యలు శూన్యమని అబ్దుల్ రహీం అవేదన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ స్పందించి అక్రమాలకు పాల్పడిన నాటి తహసీల్దార్‌పై విచారణ చేపట్టి వెంటనే సస్పెండ్ చేయాలని అబ్దుల్ రహీం డిమాండ్ చేశారు. వారం రోజుల్లో ఉన్నతాధికారులు స్పందించకుంటే నారరాయణఖేడ్ సబ్ కలెక్టర్ ముందు ధర్నా నిర్వహిస్తామని అబ్దుల్ రహీం హెచ్చరించారు.

## విధులు బహిష్కరించిన న్యాయవాదులు


న్యాయవాది హత్యకునిరసనగా విధులు బహిష్కరించిన న్యాయవాదులు

**జహీరాబాద్ మే 25 ప్రభాతవార్త :** హైదరాబాదులోని మాసబ్ ట్యాంకులో శనివారం హత్యకు గురైన న్యాయవాది కాజా మొయిజుద్దీన్ హత్యకు నిరసనగా రాష్ట్ర బార్ అసోసియేషన్ పిలుపుమేరకు సోమవారం జహీరాబాద్ అడ్వకేట్ భారసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులను బహిష్కరించి కాజా మొయిజుద్దీన్ హత్య తీవ్ర సంతాపాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ న్యాయవాది మొయిజుద్దీన్ హత్య చేసిన నిందితులను అరెస్టు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు జుబేరి ఇస్మాయిల్ డి స్మాల్లప్ప సోమశేఖర్ పాటిల్, నరేష్ గోపికృష్ణ విజయ్ కుమార్ జగన్నాథ్ బి విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మురుగు కాల్వల నిర్మాణానికి భూమిపూజ


మురుగు కాల్వల నిర్మాణానికి శ్రీకారం చుడుతున్న సర్పంచ్ శ్రీనివాస్

**పుల్‌కల్, మే 25, ప్రభాతవార్త:** ఉమ్మడి పుల్‌కల్ మండలంలోని సింగూరు గ్రామంలో 10 లక్షల ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులతో మురుగు కాల్వల నిర్మాణానికి సర్పంచ్ నందికంటి శ్రీనివాస్ ముదిరాజ్ సోమవారం పూజా కార్యక్రమాలు నిర్వహించి పనుల నిర్మాణానికి శ్రీకారంచుట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ నందికంటి శ్రీనివాస్ ముదిరాజ్ మాట్లాడుతూ గ్రామంలోని ఎస్సీ కాలనీలో మురుగు కాల్వల నిర్మాణం చేపట్టేందుకు పంచాయితీ తీర్మానం చేసిందన్నారు. మంత్రి దామోదర్ రాజనర్సింహా సహకారంతో గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎర్ర శేఖర్, కాంగ్రెస్ నాయకులు కలాలి సమగమేశ్వర్ గౌడ్, మన్నె మధుసూధన్, మల్ప వీరారెడ్డి, బెన్నాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## కోతుల బెడద నుంచి రక్షించండి..


జెసి నగేష్‌కు ప్రజావాణి ఫిర్యాదు చేస్తున్న గ్రామస్థులు

**పాపన్నపేట, మే 25, ప్రభాతవార్త :** మండల పరిధిలోని కొదుపాక గ్రామంలో రోజురోజుకూ పెరుగుతున్న కోతుల బెడద నుంచి తమను రక్షించాలని గ్రామస్తులు సోమవారం ప్రజావాణిలో మెదక్ జెసి మెంచు నగేష్‌కు ఫిర్యాదు చేశారు. కోతుల సంచారం అధికమై కోతులు ప్రజలు, పశువుల పై దాడులు చేస్తున్నాయనిఆవేదన వ్యక్తం చేశారు. చిన్నపిల్లలు, వృద్ధులు బయటకు రావడానికే భయపడుతున్న పరిస్థితి నెలకొందన్నారు. ఇళ్ల పైకప్పులపైకి ఎక్కి ఆహార పదార్థాలు ఎత్తుకెళ్లడం, ఇంటి సామగ్రిని ధ్వంసం చేయడం, పంట పొలాల్లో పండ్ల చెట్లు, కూరగాయల తోటలను నాశనం చేయడం వంటి ఘటనలు తరచూ జరుగుతున్నాయని గ్రామస్తులు తెలిపారు. పలువురిపై కోతులు దాడి చేసి గాయపరిచిన సంఘటనలు కూడా చోటుచేసుకున్నాయని పేర్కొన్నారు.సంబంధిత అధికారులు, అటవీ శాఖ సిబ్బంది వెంటనే స్పందించి కోతులను పట్టుకుని అడవుల్లో విడిచి పెట్టాలని గ్రామస్తులు కోరారు. ఫిర్యాదుచేసిన వారిలో పంతులు భూమయ్య, సతీష్, అశోక్, బిక్షపతి, అప్పర్, సురేష్, బాలయ్య, ఉన్నారు.

## ప్రభుత్వ పథకాలతో మహిళలు ఆర్థికాభివృద్ధి

**చిన్నశంకరంపేట,మే 25,ప్రభాతవార్త:** మహిళలు ప్రభుత్వ పథకాలను అందిపుచ్చుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలని ఏపీవో రాములు, చందంపేట సర్పంచి ప్రవిణ్ అన్నారు. సోమవారం మండల పరిధి చందంపేటలో మహిళా సంఘం భవనాలకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడతూ మహిళల ఆర్థిక అభివృద్ధి సమావేశాల కోసం ఈ భవనం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో సీసీలు యశోద, రాజు, మహిళా సంఘం సభ్యులు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.


మహిళా సంఘం భవనానికి భూమి పూజ చేస్తున్న దృశ్యం

# 2న కొల్చారం ఎంపిడివో కార్యాలయం ఎదుట ధర్నా

### తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం


పని చేసుకుంటున్నా ఉపాధి హామీ కూలీలు

**కొల్చారం, మే 25 (ప్రభాతవార్త):** ఉపాధి హామీ పథకంలో అమలుచేస్తున్న రెండుసార్లు ఫొటో క్యాప్చర్ విధానాన్ని రద్దు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం(ఏఐఏడబ్ల్యూయూ) డిమాండ్ చేసింది. సంఘం ఆధ్వర్యంలో సోమవారం కొల్చారం మండలంలోని పోతంశెట్టిపల్లి, దేవుని వెంకటాపూర్, కొంగోడు తదితర గ్రామాల్లో ఉపాధి హామీ పనుల ప్రదేశాలను సందర్శించి కూలీలతో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కోశాధికారి కె.నర్సమ్మ మాట్లాడుతూ, రెండు సార్లు ఫొటో క్యాప్చర్ విధానం కారణంగా కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఫొటోలు సక్రమంగా నమోదు కాకపోవడంతో కొందరు కూలీలు అదనపు బ్యాటరీలు, పవర్ బ్యాంకులు వెంట తీసుకెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. గ్రామాల్లో పని ప్రదేశాల్లో టెంట్లు, తాగునీరు, మెడికల్ కిట్ వంటి కనీస సౌకర్యాలు లేకపోవడంతో పాటు, పనిచేసినప్పటికీ వేతనాలు సకాలంలో అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎండ తీవ్రత కారణంగా కూలీల చేతులకు బొబ్బలు వస్తున్నాయని, చట్టంలో ఉన్నప్పటికీ ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ జరగడం లేదని విమర్శించారు. ప్రతి వారం వేతనాలు చెల్లించకపోవడంతో కూలీలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ కఠిన నిబంధనల కారణంగా ఉపాధి పనులకు హాజరయ్యే కూలీల సంఖ్య రోజురోజుకు తగ్గిపోతోందన్నారు. ఉపాధి హామీ పథకం అమలులో కీలకపాత్ర పోషిస్తున్న మేట్లకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, అర్హులందరికీ జాబ్ కార్డులు జారీ చేసి పని కల్పించాలని డిమాండ్ చేశారు. గడ్డపారలు, గంపలు, పారలు ఉచితంగా పంపిణీ చేయాలని, దూర ప్రాంతాలకు వెళ్లి పని చేసే కూలీలకు రవాణా భత్యం చెల్లించాలని కోరారు. పాత విధానంలోనే నరేగా పనులను కొనసాగించాలని, కొత్తగా తీసుకు వచ్చిన విధానాలు కూలీలను పనికి దూరం చేస్తున్నాయని ఆరోపించారు. ఉపాధి హామీ పథకంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని, రెండుసార్లు ఫొటో క్యాప్చర్ విధానాన్ని రద్దు చేయాలని, పని ప్రదేశాల్లో టెంట్లు, తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేస్తూ జూన్ 2న కొల్చారం ఎంపీడీఓ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో దాసు, వివిధ గ్రామాల ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.


మహిళా సమైఖ్య భవన నిర్మాణానికి శ్రీకారం చుడుతున్న దృశ్యం

## మహిళా సమాఖ్య భవన నిర్మాణానికి శ్రీకారం

**మొగుడంపల్లి, మే 25, ప్రభాతవార్త:** మండల పరిధిలోని మన్నాపూర్ గ్రామంలో మహిళా సమైఖ్య భవన నిర్మాణానికి గ్రామ సర్పంచ్ హరిసింగ్ ఉపాధి హామి ఏపిఓ టిక్య నాయక్‌తో కలిసి సోమవారం భూమి పూజా కార్యక్రమాలు నిర్వహించి భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ టిక్యా నాయక్ మాట్లాడుతూ మహిళా సంఘాల బలోపేతానికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ద తీసుకుని భవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టిందన్నారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేలా కాంగ్రెస్ ప్రభుత్వం కృతనిశ్చయంతో పని చేసోందని సర్పంచ్ హరిసింగ్ పేర్కొన్నారు. కార్యక్రమంలోఉప సర్పంచ్ ప్రవీణ్, మాజీ సర్పంచ్ ఈశ్వర్‌రెడ్డి, వార్డు సభ్యులు సాగర్, గుండన్న, మహిళా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా మహిళా సంక్షేమ వారోత్సవం

**రామాయంపేట, మే 25, ప్రభాతవార్త :** పేదరిక నిర్మూలన సంస్థ మెప్మా, మెదక్ జిల్లా ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా మే 25 నుండి 30 వరకు జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలలో మహిళా వారోత్సవాలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం రామాయంపేట పురపాలక సంఘంలో మహిళా సంక్షేమ వారోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పట్టణ సమైక్య స్థాయిలో అన్ని మహిళా సమైక్య సభ్యులతో ప్రత్యేక జనరల్ బాడీ పాధి అవకాశాల విస్తరణ, స్వయం సహాయక సంఘాల బలోపేతంపై కులంకుశంగా చర్చించారు. చిరువ్యాపారులకు, ఇందిరా మహిళాశక్తి పథకం ద్వారా వ్యక్తిగత రుణాలు, స్త్రీనిధి రుణాలు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల గుర్తింపు, పీఎం స్వనిధి ద్వారా వీధి వ్యాపారుల గుర్తింపు మరియు వారికి రుణాల మంజూరు అంశాలపై సభ్యులకు అవగాహన కల్పించారు. జిల్లా మెప్మా పీడీ హనుమంత్‌రెడ్డి, టీఎంసీ సునీత ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో రామాయంపేట మెప్మా రిసోర్స్ పర్సన్లు (ఆర్పీలు) మర్కు లావణ్య, రజిత, వసంత, శ్రీలత (టిఎల్ఎఫ్ ఆర్పీ), రూప, స్వాతి, స్రవంతి, విజయశ్రీ, రోహిణి, లావణ్య, కవిత, తరంగిణి, ఆర్. స్రవంతి, బాల్‌లక్ష్మి, ఓబీలు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## 35 మందికి ఉచితంగా కంటి ఆపరేషన్లు : ఆవుల రాజిరెడ్డి

**వెల్దుర్తి, మే 25, ప్రభాతవార్త :** మండల కేంద్రంలో ఇటీవల నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 35 మందికి కంటి ఆపరేషన్లు అవసరం ఉన్నట్లు గుర్తించడం జరిగిందన్నారు. అందుకుగాను సోమవారం ఆపరేషన్ అవసరం ఉన్న 35 మందిని బస్సులో హైదరాబాద్ పుష్పగిరి కంటి ఆసుపత్రికి తరలించడం జరిగిందని ఆవుల రాజిరెడ్డి తెలిపారు. కంటి అద్దాలు ఉచితంగా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహేష్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ సుధాకర్‌గౌడ్, నాయకులు మైసయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

## ఎంపి రఘునందన్‌రావును కలిసి బిజెపి నేతలు

**వర్గల్, మే 25 (ప్రభాతవార్త):** మెదక్ ఎంపి మాధవనేని రఘునందన్ రావును సోమవారం వారి నివాసంలో బిజెపి నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా మైలారం గ్రామాభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని వినతిపత్రం అందజేయగా, స్పందించిన ఎంపి రఘునందన్‌రావు వెంటనే రూ.10 లక్షలు మంజూరు చేయనున్నట్లు హామీ ఇచ్చారని తెలిపారు. ఎంపిని కలిసినవారిలో బిజెపి మండల అధ్యక్షుడు బొల్లిపల్లి తిరుపతిరెడ్డి, మైలారం గ్రామ సర్పంచ్ బూర్గుపల్లి మల్లేశం, ఉపసర్పంచ్ లింగస్వామి, వార్డు సభ్యులు నర్ర రవి ప్రభావతి, ఎర్రవాడ ప్రవీణ్, కాశమైన నర్సింలు, లింగ గణేష్, గ్రామ అధ్యక్షుడు నర్ర రవి, రామాంజనేయులు, కాయిత రాజు పాల్గొన్నారు.


ఎంపికి వినతిపత్రం అందజేస్తున్న బిజెపి నాయకులు


గ్రామ సంఘ భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న దృశ్యం

## గ్రామ సంఘ నూతన భవనాలకు భూమి పూజలు

**నర్సాపూర్, మే 25, ప్రభాతవార్త :** మండలంలో 99 రోజుల ప్రణాలికలో భాగంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక లో నర్సాపూర్ మండలంలోని పలు గ్రామాల్లో నూతన గ్రామ సంఘ భవనాల నిర్మాణాలకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మండలంలోని మహమ్మదాబాద్, పెద్దచింతకుంట, గొల్లపల్లి గ్రామాలకు నూతన గ్రామ సంఘ భవన నిర్మాణాలకు నిధులు మంజూరైనందున గ్రామ సంఘం బిల్డింగులకు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు గుండె శివకుమార్, లక్ష్మి ్మ, నూసావత్ బిందు సురేష్, వివోఏ సురేష్, సీసీలు నర్సింలు, దేవిసింగ్, నాగరాజు, ఏపీఎం సంగమేశ్వర్, ఏఈపీఆర్ మల్లేశం పాల్గొన్నారు.

## విద్యార్థులకు బహుమతులు ప్రదానం


ముస్లాపూర్‌లో విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఎంఈఓ

**అల్లాదుర్గం, మే 25, ప్రభాతవార్త :** మండల పరిధిలోని ముస్లాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సమ్మర్ క్యాంప్ ముగింపు సమావేశం సోమవారం నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఎంఈఓ లక్ష్మణ్ బహుమతులు ప్రదానం చేశారు. ఈనెల 11 నుండి నేటివరకు నిర్వహించిన సమ్మర్ క్యాంపులో విద్యార్థులకు డ్రాయింగ్,ఏం రైడింగ్, యోగ, సంగీతం, చిత్రలేఖనం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వీటిలో ప్రావీణ్యం సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా చిత్ర ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ముగిసిన వేసవి శిబిరం

**వెల్దుర్తి, మే 25, ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో మే 11 నుండి ప్రారంభమైన వేసవి కాల శిబిరం 25న విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా వినోదాన్ని మాత్రమే కాకుండా జీవితానికి ఉపయోగపడే ఎన్నో విలువైన పాఠాలను నేర్పిందని హెచ్ఎం సాంబయ్య అన్నారు. శిబిరంలో విద్యార్థులు ఎంత ఉత్సాహంగా ప్రతిరోజు పాల్గొని తమ ప్రతిభలను ప్రదర్శించారన్నారు. సంగీతం. యోగ. కరాటే. నృత్యం. కార్యక్రమాలతో విద్యార్థులు వారి ఆత్మ విశ్వాసాన్ని పెంచాయి. డాన్స్ మాస్టర్ చింటూ. కరాటే మాస్టర్ నైనిశా. యుగ టీచర్ అనంతరెడ్డి. మ్యూజిక్ టీచర్ చంద్ర గౌడ్. వీరిని ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ సమ్మర్ క్యాంపులో విద్యార్థుల ప్రతిభను వికసింపజేసిన అందరికీ ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసరావు. విజయ మోహన్. ఖదీర్ పాషా తదితరులు పాల్గొన్నారు.


ఉపాధ్యాయులను సన్మానించిన హెచ్ఎం సాంబయ్య

# శివ్వంపేట పిఎసిఎస్ కార్యాలయం ఎదుట రైతుల నిరసన


రైతులతో మాట్లాడుతున్న ఎస్సై మధుకర్‌రెడ్డి

**శివ్వంపేట, మే 25(ప్రభాతవార్త) :** రైతులు ఆరు కాలం కష్టించి పండించిన పంటను వద్ల కొనుగోలు కేంద్రాలలో కొనుగోలు చేయకుండా నెల రోజులు గడుస్తున్నా కొనుగోలు చేయకుండా నిరక్ష్యం వహిస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం పీఏసీఎస్ కార్యాలయం ఎదుట రత్నాపూర్ గ్రామానికి చెందిన రైతులు నిరసన వ్యక్తం చేశారు. గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో వడ్లు తరలించేందుకు లారీలు పంపించకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీఈవో మధుకు ఎన్నిసార్లు ఫోన్‌చేసినా కనీసం స్పందించడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ పంటను ఆరుగాలం కష్టపడి పండించి కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చామని, అయితే రోజుల తరబడి ధాన్యం అక్కడే పేరుకుపోయినా అధికారులు పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. ప్రస్తుతం వాతావరణం మారుతున్న నేపథ్యంలో ఎప్పుడు వర్షం పడుతుందో తెలియని పరిస్థితి ఉందని, ఒకవేళ వర్షం కురిస్తే ధాన్యం తడిసి భారీ నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల కష్టాన్ని అధికారులు అర్థం చేసుకోకుండా నిరక్ష ్యంగా వ్యవహరిస్తున్నారని విమ ర్శించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి కొనుగోలు చేసిన ధాన్యాన్ని తరలించేందుకు తక్షణమే లారీలు ఏర్పాటు చేయా లని రైతులు డిమాండ్ చేశారు. అనంతరం రైతులు నర్సాపూర్ తూప్రాన్ ప్రధాన రహదారిపై బైటా యించి సీఈఓ మధు డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు ధర్నా స్థలానికి చేరుకొని రైతులకు నచ్చజెప్పి రాస్తారోకోను విరమింపచేశారు.

## ముగిసిన వేసవి శిక్షణ శిబిరం

**సిర్గాపూర్, మే 25, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 11వ తేదీన ప్రారంభించిన వేసవి శిక్షణ శిబిరాలు సోమవారంతో ముగిసాయి. 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు విద్యాను అందుకుంటున్న విద్యార్థులకు రాత, డ్రాయింగ్,అల్లికలు, కంప్యూటర్, గేమ్స్ లాంటి అంశాలపై విద్యార్థులకు శిక్షకులు ఆరే రవీందర్, స్వప్న, వెంకట్‌రావ్, కృష్ణ యాదవ్‌లు శిక్షణ ఇచ్చారు. వేసవి శిక్షణ కార్యక్రమాలతో తమకెంతో మేలు చేకూరిందని విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు ధృవపత్రాలు అందచేశారు.

## నర్సరీలను పరిశీలించిన ఎపిడి పూజ

**న్యాల్‌కల్, మే 25, ప్రభాతవార్త:** ఉపాధి హామి పథకంలో కూలీలు ఎక్కువగా పాల్గొనేలా చర్యలు తీసుకోవాలలని ఉపాధి హామి ఎపిడి పూజ అధికారులకు సూచించారు. సోమవారం న్యాల్‌కల్‌తో పాటు మండలంలోని ఖలీల్‌పూర్, మిర్జాపూర్(బి), గంగ్వార్, మంగి గ్రామాల్లో కొనసాగుతున్న ఉపాధి హామి పనుల ప్రదేశాలను, గ్రామాల్లో నిర్వహిస్తున్న నర్సరీలను ఎపిడి పూజ మండల అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎపిడి పూజ మాట్లాడుతూ ఉపాధి కూలీలు పనుల్లో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నర్సరీల నిర్వాహణ సక్రమంగా చూసుకోవాలని నిర్వహకులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపిడిఓ నరేస్‌బాబు, ఉపాధి హామి ఏపిఓ రంగారావు, ఆయా గ్రామాల పంచాయితీ కార్యదర్శులు, ఉపాధి హామి ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## రైతులకు అందుబాటులో జనుము విత్తనాలు

**న్యాల్‌కల్, మే 25, ప్రభాతవార్త:** మండలంలోని ఆయా గ్రామాల రైతులకు జనుము విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి అభినాష్‌వర్మ తెలిపారు. మండలానికి 250 బస్తాల జనుములు సరఫరా అయ్యాయన్నారు. న్యాల్‌కల్‌లోని రైతు వేదికలో పట్టాదారు పుసుపుస్తకాలు, ఆధార్ కార్డు జిరాక్సు పత్రాలు తీసుకువచ్చి టోకెన్‌ను అందుకోవాలన్నారు. టోకెన్‌లు తీసుకున్న రైతులు న్యాల్‌కల్‌లోని డిసిఎంఎస్, హద్నూర్‌లోని సొసైటీ కార్యాలయంలో జనుము విత్తనాలు అందుకోవాలని సూచించారు. 40 కిలోల ఒక బస్తా రూ. 3110 అందచేస్తామన్నారు. 5 ఎకరాల వరకుఉన్న రైతుకు ఒక బస్తా, 5 ఎకరాల కంటే అధికంగా భూమి ఉన్న రైతులకు 2 బస్తాల జనుము విత్తనాలు అందచేస్తామన్నారు. జనుము బస్తాలు తీసుకున్న రైతుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామని, సదరురైతు ఇతర పంటల సాగు చేసినట్లు ఎంట్రీ చేయమని సూచించారు.

## నేటి విద్యార్థులే భావి భారత నిర్మాతలు : డిఎస్‌పి

**నారాయణఖేడ్, మే 25 ప్రభాతవార్త :** విద్యార్థులను వేసవి సెలవులలో సమయాన్ని వృధా చేయకుండా మానసిక, శారీరిక వికాసానికి దోహదపడే క్రీడలు, చిత్రకళ,యోగ, సంగీతం,బ్యూటిషన్ తదితర విషయాలలో ఉచిత శిక్షణ ఇవ్వడం గొప్ప విషయమని డీఎస్పీ వెంకటరెడ్డి అన్నారు. సోమవారం జడ్పిహెచ్ఎస్‌లో సమ్మర్ క్యాంపు ముగింపు సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి విద్యార్థిలే భావి భారత నిర్మాతలని అన్నారు. 15 రోజుల నుంచి క్రమశిక్షణతో నేర్చుకున్న విద్యార్థుల ప్రదర్శనలను చూసి వారి ప్రతిభను కొనియాడారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సమ్మర్ క్యాంప్ ప్రశంస పత్రాలను అందజేశారు పిజిహెచ్ఎం మన్మధ కిషోర్, ఉపాధ్యాయులు యాదగిరి, రాజ శేఖర్ అశోక్ గౌడ్, చంద్రశేఖర్ ఆచార్య,డాక్టర్ రాజయ్య,గురునాథ్,ధన్ సింగ్, లీపు ఆర్టిస్టు శివకుమార్ పాల్గొన్నారు.

## నూతన వధువుకు ఆర్థిక సహాయం అందజేత

**మనూర్, మే 25, ప్రభాతవార్త :** పంచాయతీ ఎన్నికల సందర్భంగా చేసిన హామీలను గ్రామ సర్పంచ్ బిరాదర్‌దత్తు అమలు చేస్తూ వస్తున్నారు. దోసపల్లి పంచాయతీ ఎన్నికల సందర్భంగా సర్పంచ్ బరిలో ఉన్న బిరదర్ దత్తు గ్రామంలోని ప్రతి ఆడపడుచు పెళ్లికి కళ్యాణమస్తు పథకం ద్వార 11016 రూపాయలను అందించి తన వంతు సహకారం అందచేస్తానని చేసిన హామీ మేరకు మండల పరిధిలోని దోసపల్లి గ్రామానికి చెందిన నయోమి విహాహాన్ని పురస్కరించుకుని వధువు తల్లిదండ్రులు ఎర్రోల్ల రూతమ్మ, ప్రకాస్ దంపతులకు సర్పంచ్ ఆర్థిక సహాయం అందచేసి నూతన వధువును ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మనూర్ సర్పంచ్ గంపల సిద్దారెడ్డి ఉన్నారు.

## గర్భిణీలు, కిశోర బాలికలు పౌష్టికారం తీసుకోవాలి

### మున్సిపల్ ఛైర్మన్ లక్ష్మీరాజుయాదవ్

**నర్సాపూర్, మే 25 తర్వాతవార్త :** గర్భిణీలు, కిశోర బాలికలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండటానికి నిత్యం పోషకాహారం తీసుకోవడం ఎంతో అవసరమని నర్సాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి రాజు యాదవ్ అన్నారు.99 రోజుల కార్యాచరణ్ణ ప్రణాళికలో భాగంగా సోమవారం పట్టణంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన మహిళా సంక్షేమ వారోత్సవాల కార్యక్రమాన్ని ఆమె జ్యోతి ప్రజ్వలనచేసి ప్రారంభించారు.ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రదర్శనను ఆమె నిశితంగా పరిశీలించి, అక్కడికి వచ్చిన మహిళలతో పోషణ్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. నిత్యం తీసుకునే ఆహారపు అలవాట్లపై ప్రతి ఒక్కరూ ప్రత్యేక అవగాహన కలిగి ఉండాలన్నారు. సరైన పోషక విలువలు ఉన్న ఆహారాన్ని తీసుకోవడం ద్వారానే ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. అనంతరం గర్భిణీలకు ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సాయికుమార్, కౌన్సిలర్లు సుధీర్, అఫ్రిన్, మెడికల్ ఆఫీసర్ సాయిదీప్తి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శివకుమారి, ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

## చెరువు పూడిక తీత పనులు ప్రారంభం

**నర్సాపూర్ మే 25 ప్రభాతవార్త :** మండల పరిధిలోని అచ్చంపేట గ్రామంలో చెరువు పూడికతీత పనులు ప్రారంభమయ్యాయి.చెరువు పూడిక పనులను ఏషియన్ పెయింట్ సిఎస్ఆర్ నిధులనుండి అంబుజ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ పనులు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా సోమవారం అంబుజా ఫౌండేషన్ ప్రతినిధులతో కలిసి గ్రామ సర్పంచ్ నీరుడి తుల్చమ్మ బిక్షపతి ల చేతుల మీదుగా పనులు ప్రారంభించారు ఈ పనుల్లో చెరువులో నుండి మట్టిని రైతుల పంట పొలాలకు ఎరువుగా వేసుకోవచ్చు అంతేగాక కట్ట వెడల్పు పనులు, చెరువు లోతుగా ఏర్పడి నీరు నిలిచె అవకాశం ఉంది ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ నీరుడు తుల్చమ్మ బిక్షపతిల వినతి మేరకు అంబుజా ఫౌండేషన్ ప్రతినిధులు ఈపూడిక తీత పనులను చేపట్టారు ఈ పనులు పూర్తయితే గ్రామస్తులకు రైతులకు పశువులకు నీటి కొరత ఉండదని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లోచెరువుల అభివృద్ధి కోసం అంబుజా ఫౌండేషన్ విశేషంగా కృషి చేస్తుందని ఆ సంస్థ.ప్రతినిధి ప్రాజెక్టు కోఆర్డినేటర్ సుందర్ ఫీల్డ్ ఫెసిలిటర్ తుకారాం తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ నవీన్, వార్డుమెంబర్ ఆంజనేయులు, గ్రామస్తులు నర్సయ్య బోయిని అంజనేయులు శంకర్ యాదగిరి తదితరులున్నారు

## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే

**వెల్దుర్తి, మే 25, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన మాసాయిపేట. బొమ్మరం గ్రామాల్లో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను నర్సాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే సునీతలక్ష్మారెడ్డి పరిశీలించారు. రైతులు నిల్వ ఉంచిన వరి ధాన్యాన్ని చూసి ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం సంచల్లోనే ధాన్యం ఉండిపోవడంతో వడ్లు మొలకెత్తిన పరిస్థితిని ఆమె గమనించారు. వెంటనే స్పందించిన ఆమె ఈ ధాన్యాన్ని తక్షణమే రైస్ మిల్లులకు తరలించాలని సబ్ కలెక్టర్. ఎమ్మార్వోలకు. అధికారులతో ఆమె చరవాణి ద్వారా మాట్లాడారు. ధాన్యం సంచుల్లోనే మొలపెట్టడంతో రైతులు తీవ్ర నిరాశ వ్యక్తం చేశారు. తాము ఆరుకాలం కష్టించి పండించిన ధాన్యానికి తగిన ఫలితం దక్కాలని అధికారం కోరారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నా ఇప్పటివరకు ధాన్యం కొనుగోలులో నిరక్ష్యం వహించవద్దని ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి రైతులకు ధైర్య చెబుతూ సమస్య త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని ఆమె హామీ ఇచ్చారు. ప్రభుత్వం ప్రజా పాలన అంటూ రైతులను నట్టేట ముస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు మధుసూదన్‌రెడ్డి. నాగరాజు. శ్రీనివాస్. నాతోపాటు రైతులు తదితరులు పాల్గొన్నారు.


మాసాయిపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే